ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:88 | ఎడిటర్:మేనం శ్యామ్ | ఆదివారం 18-10-2026 | పేజీలు: 10



సిరా చుక్క

తంగేడు పూల సిరుల తోరణం,
తెలంగాణ తల్లి నవయౌవన రూపం,
గుండె గుండెలో పొంగే భక్తి,
సంస్కృతి చాటే సాంస్కృతిక శక్తి...!
యాస భాషల కలబోత,
ఆడబిడ్డల మురిపాల బలం...
రంగురంగుల పూల పల్లకిలో,
గౌరమ్మ కొలువుండే వెలుగుల్లో..
ఉద్యమ పోరాటపు వేళలో,
చైతన్యమై నిలిచిన రూపమిది..
పాఠశాలల వీధుల్లో,
కార్యాలయాల ముందర...
సాంస్కృతిక జెండై ఎగిరిన ఘనత ఇది..
బతుకమ్మ అంటే ఒక పండుగ కాదు,
తెలంగాణ నేల గర్వంగా
తలెత్తుకునే అస్తిత్వం..
మన సంప్రదాయం, మన ప్రాణం,
తెలంగాణ గుండెచప్పుడు
ఈ గౌరమ్మ మా ప్రాణం..
తెలంగాణ ఆడపడుచులకు
సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు..!

రాగిపని బ్రహ్మచారి,
నల్గొండ.

తాగునీరు వృథా చేస్తే జరిమానా..
హైదరాబాద్‌లో మూడు కార్పొరేషన్ల కీలక నిర్ణయం

- నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు పొదుపు చర్యలు ముమ్మరం
- వాహనాలు, రోడ్లు, ఇంటి ఆవరణలు తాగునీటితో శుభ్రం చేస్తే చర్యలు
- నిర్మాణ పనులకు మున్సిపల్, బోరు నీటి వినియోగంపై ఆంక్షలు
- ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని ఆదేశాలు
- సీఎంసీ పరిధిలో 339 ప్రైవేటు ఎస్టీపీల తనిఖీలకు సిద్ధం

హైదరాబాద్, ప్రజా వాయిస్: హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు మూడు నగరపాలక సంస్థలు నీటి పొదుపు చర్యలను ముమ్మరం చేశాయి. సైబరాబాద్ నగరపాలక సంస్థ (సీఎంసీ), హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ), మల్కాజిగిరి నగరపాలక సంస్థ (ఎంఎంసీ) పరిధిలో నీటి వృథాను అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించాయి. తాగునీటిని వాహనాలు కడగడం, రోడ్లు, ఇంటి ఆవరణలు శుభ్రం చేయడం వంటి అవసరాలకు వినియోగిస్తే జరిమానాలు విధించనున్నారు.

నిర్మాణ పనులకు శుద్ధి చేసిన నీరే..

బహుళ అంతస్తుల భవనాలు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాల్లో మున్సిపల్ సరఫరా నీరు, బోరుబావుల నీటి వినియోగాన్ని నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. నిర్మాణ పనులతో పాటు గేటెడ్ కమ్యూనిటీల్లో పార్కులు, పచ్చదనం నిర్వహణకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీ) శుద్ధి చేసిన నీటిని ఉపయోగించాలని స్పష్టం చేశారు. కార్పొరేషన్ల ఆధ్వర్యంలో చేపట్టే పనులకూ ఇదే నిబంధన వర్తించనుంది.పార్కులు, రహదారుల మధ్య విభాగినులు, కాలిబాటల పక్కన ఉన్న మొక్కలకు నీరు అందించేందుకు కూడా శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సంబంధిత విభాగాలకు సూచించారు

339 ఎస్టీపీల తనిఖీలు

సైబరాబాద్ నగరపాలక సంస్థ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీల్లో 339 ప్రైవేటు ఎస్టీపీలను గుర్తించినట్లు కమిషనర్ జి. సృజన తెలిపారు. ఈ కేంద్రాల పనితీరును టౌన్‌ప్లానింగ్ అధికారులు తనిఖీ చేయనున్నారు. శుద్ధి కేంద్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా, శుద్ధి చేసిన నీటిని నిబంధనల ప్రకారం వినియోగిస్తున్నారా అనే అంశాలను పరిశీలిస్తారు. ఎస్టీపీలు పనిచేయకపోయినా, నిబంధనలను ఉల్లంఘించినా జరిమానాలు విధిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు కూడా మూడు కార్పొరేషన్లు చర్యలు చేపట్టనున్నాయి. ముఖ్యంగా ముంపు ప్రాంతాల్లో దశలవారీగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. వర్షపు నీరు వృథాగా కాలువల్లోకి వెళ్లిపోకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ప్రజల సహకారం కీలకం

తాగునీటిని తాగేందుకు, వంట అవసరాలకు, ఇతర అత్యవసర వినియోగాలకు అందుబాటులో ఉంచడమే ఈ చర్యల ప్రధాన లక్ష్యం. అపార్ట్‌మెంట్ల యాజమాన్యాలు, నిర్మాణ సంస్థలు, వాణిజ్య సంస్థలు నీటిని బాధ్యతగా వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు.

శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని పెంచడం, తాగునీటి వృథాను తగ్గించడం ద్వారా నగరంపై నీటి వనరుల ఒత్తిడిని తగ్గించవచ్చని భావిస్తున్నారు.

తెలంగాణలో 315 మండలాల్లో కరవు..
కేంద్ర సాయానికి తుమ్మల విజ్ఞప్తి

- కరవు ప్రభావిత ప్రాంతాలకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరిన మంత్రి
- సూక్ష్మ సేద్యం, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలకు చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి
- మొక్కజొన్న, జొన్న పంటలకు పూర్తి మద్దతు ధర కల్పించాలని ప్రతిపాదన
- ఎల్‌నినో నేపథ్యంలో నీరు, విద్యుత్ పొదుపుగా వాడాలని భట్టి పిలుపు
- రాష్ట్రంలో 20 వేల మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్

హైదరాబాద్, ప్రజా వాయిస్:తెలంగాణలో కరవు పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి తక్షణ సహాయం కోరింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి వివరించారు. రైతులకు ఉపశమనం కల్పించేందుకు సూక్ష్మ సేద్యానికి, ప్రత్యామ్నాయ పంటల విత్తనాల పంపిణీకి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో సమావేశంలో పాల్గొన్న తుమ్మల.. తెలంగాణలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వర్షాభావం కారణంగా పంటల సాగు, దిగుబడులు, పెట్టుబడుల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

పంటలకు పూర్తి మద్దతు ధర కల్పించాలి

నీటి లభ్యత తక్కువగా ఉన్న

మిగతా 2లో

వరంగల్
పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట

- హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్
- త్వరలోనే వరంగల్ విమానాశ్రయం ప్రారంభిస్తాం
- హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తాం
- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- ట్రై సిటీస్ మారథాన్‌లో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు

2 లో

పాలమూరు నీటి కోసం
గురువుతోనైనా పోరాడతా

- నీటి హక్కుల విషయంలో రాజీపడేది లేదన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- ఏదుల నుంచి డిండి ప్రాజెక్టుకు నీటి తరలింపు ప్రతిపాదనపై అభ్యంతరం
- ముందుగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీరివ్వాలని డిమాండ్
- జేఏసీ జలదీక్షకు సంపూర్ణ మద్దతు
- పాలమూరు ఎమ్మెల్యేలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపు

జడ్చర్ల, ప్రజా వాయిస్: పాలమూరు ప్రాంత నీటి హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోనని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన రాజకీయ గురువైనప్పటికీ, పాలమూరు నీటి వాటా విషయంలో అవసరమైతే ఆయనతోనైనా పోరాడతానని ప్రకటించారు. తనకు వ్యక్తిగత అనుబంధాల కంటే ప్రాంత ప్రయోజనాలే ముఖ్యమని తేల్చిచెప్పారు. జడ్చర్లలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

ఉద్యోగం పేరుతో వంచన..
మహిళపై లైంగిక దాడి

- ఇంటి పని ఇప్పిస్తానంటూ మహిళకు మాయమాటలు
- ఆటోలో జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 51కు తరలింపు
- నిర్మానుష్య ప్రాంతంలో అఘాయిత్యం
- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు
- సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడి కోసం గాలింపు

2 లో



రూ.15 కోట్లకు డిమాండ్.. రూ.1.30 కోట్లతో
జ్యువెల్లరీ వ్యాపారి కిడ్నాప్ కథ ముగింపు

- రామాంతపూర్ వ్యాపారి శ్రీనివాసరావు కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు
- పోలీసులమని నమ్మించి అపహరణ.. కళ్లకు గంతలు కట్టి నిర్బంధం
- కుటుంబ సభ్యుల నుంచి రూ.1.30 కోట్లు వసూలు చేసిన ముఠా
- తొమ్మిది మంది అరెస్ట్.. మరో ఇద్దరు పరారీలో
- రూ.1.07 కోట్ల నగదు, బంగారం, వెండి, ఐదు వాహనాలు స్వాధీనం

హైదరాబాద్, ప్రజా వాయిస్: నగరంలో సంచలనం సృష్టించిన రామాంతపూర్ జ్యువెల్లరీ వ్యాపారి శ్రీనివాసరావు కిడ్నాప్ కేసును చిక్కడపల్లి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితమూర్తి మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

పోలీసులమంటూ నమ్మించి కిడ్నాప్

రామాంతపూర్‌కు చెందిన శ్రీనివాసరావును అక్టోబర్ 5న గోల్నాక ఫ్లైఓవర్ సమీపంలో నిందితులు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. తాము పోలీసులమని నమ్మించి ఆయనను వాహనంలో ఎక్కించుకున్నారు. అనంతరం కళ్లకు గంతలు కట్టి గుర్తుతెలియని ప్రాంతానికి తీసుకెళ్లి నిర్బంధించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.15 కోట్లు డిమాండ్ చేయగా, చివరకు వారి నుంచి రూ.1.30 కోట్లు వసూలు చేసినట్లు వెల్లడించారు. ఆ తర్వాత శ్రీనివాసరావును నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెట్టారు.

పాత కక్షలే కారణమా?

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో గతంలో ఏర్పడిన కక్షల కారణంగానే శ్రీనివాసరావును కిడ్నాప్ చేసినట్లు నిందితులు విచారణలో అంగీకరించారని పోలీసులు తెలిపారు. ఫోన్ సిగ్నళ్లు, సీసీటీవీ దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నకిలీ నంబర్ ప్లేట్లు ఉపయోగిస్తూ, వాహనాలను మారుస్తూ పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు నిందితులు ప్రయత్నించినట్లు గుర్తించారు.

నగదు, బంగారం, వాహనాలు స్వాధీనం

నిందితుల నుంచి రూ.1.07 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సుమారు 97.09 గ్రాముల బంగారం, మూడు గ్రాముల వెండితో పాటు బొలెరో, ఎర్టిగా, కియా సెల్టోస్ సహా మొత్తం ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. నిందితులపై గతంలోనూ కిడ్నాప్, దోపిడీ, మోసం కేసులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

దసరా ప్రయాణ కష్టాలు..
బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు

- సొంతూళ్లకు పయనమైన నగరవాసులు
- బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట
- జేబీఎస్‌లో తెల్లవారుజాము నుంచే పెరిగిన ప్రయాణికుల రద్దీ
- ప్రత్యేక బస్సులు సమయానికి రావడం లేదని ప్రయాణికుల ఆవేదన
- స్పెషల్ బస్సుల్లో 40 శాతం అదనపు ఛార్జీల వసూలుపై ఆరోపణలు
- హైదరాబాద్ నుంచి జిల్లాలకు 7 వేల ప్రత్యేక బస్సులు
- రద్దీపై ఆర్టీసీ ఎండీ పర్యవేక్షణ.. తిరుగు ప్రయాణానికీ ప్రత్యేక సర్వీసులు

2 లో

తెలంగాణలో 315 మండలాల్లో కరవు..
కేంద్ర సాయానికి తుమ్మల విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి

ప్రాంతాల్లో సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని తుమ్మల కోరారు. మొక్కజొన్న, జొన్న తదితర పంటలకు పూర్తి స్థాయిలో మద్దతు ధర కల్పించాలని ప్రతిపాదించారు. ధరల మద్దతు పథకం కింద కొనుగోళ్లకు ప్రస్తుతం ఉన్న 25 శాతం పరిమితిని తొలగించి రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.రసాయన ఎరువుల ధరలు, రాయితీలను హేతుబద్ధీకరించాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. కరవు ప్రభావిత ప్రాంతాల్లో నీటి సంరక్షణ పనులు చేపట్టడం, భూగర్భ జలాలను పెంపొందించడం, ప్రత్యామ్నాయ సాగు విధానాలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అండగా నిలవాలని కేంద్రాన్ని కోరారు.

ఎల్‌నినో నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

మరోవైపు ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ అవార్డుల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సహజ వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

20 వేల మెగావాట్లకు విద్యుత్ డిమాండ్

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ప్రస్తుతం 20 వేల మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో విద్యుత్‌ను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.వ్యవసాయం, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలపై వర్షాభావ పరిస్థితులు ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రభుత్వం చేపట్టే చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు. కరవును ఎదుర్కోవడం, రైతులకు సహాయం అందించడం, నీటి వనరులను కాపాడుకోవడం ప్రస్తుతం కీలకమని స్పష్టం చేశారు.

వరంగల్ పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట

హనుమకొండ, ప్రజా వాయిస్: వరంగల్ నగరాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్ తర్వాత తెలంగాణలో వరంగల్ అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. త్వరలోనే వరంగల్ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. హనుమకొండలో శనివారం నిర్వహించిన ట్రై సిటీస్ మారథాన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటు

హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటు చేయనున్నట్లు శ్రీధర్‌బాబు ప్రకటించారు. వరంగల్ ప్రాంతంలో పారిశ్రామిక, సాంకేతిక రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని, అందుబాటులోకి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్యమే అసలైన సంపద

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడంతోపాటు వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5కే, 10కే, 21కే పరుగులను నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు.

ఎన్‌ఐటీ నుంచి హయగ్రీవాచారి మైదానం వరకు పరుగు

యువతలో ఆరోగ్య స్పృహ, శారీరక దృఢత్వం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఎన్‌ఐటీ నుంచి హయగ్రీవాచారి మైదానం వరకు పరుగు కొనసాగింది. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పాల్గొన్నారు.

పాలమూరు నీటి కోసం గురువుతోనైనా పోరాడతా

మొదటి పేజీ తరువాయి

ముందుగా పాలమూరుకు నీరు ఇవ్వాలి

పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల మధ్య నీటి కేటాయింపుల అంశంపై అనిరుధ్‌రెడ్డి స్పందించారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రతిపాదనను అంగీకరించబోమని స్పష్టం చేశారు. ముందుగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా పాలమూరు ప్రాంతానికి నీరు అందించిన తర్వాతే డిండి ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించడం, ప్రాంత అవసరాలను తీర్చడం ప్రాధాన్యంగా ఉండాలని పేర్కొన్నారు.

గత ప్రభుత్వంపై విమర్శలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 60 శాతం మాత్రమే పూర్తయ్యాయని అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. పనులు ఆలస్యం కావడంతో పాలమూరు రైతులు ఆశించిన స్థాయిలో సాగునీటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారని అన్నారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి నీటిని అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని సూచించారు.

జలదీక్షకు మద్దతు

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు సాధన కోసం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చేపట్టనున్న జలదీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పాలమూరు ప్రాంతానికి న్యాయంగా నీటి వాటా దక్కేలా ఎమ్మెల్యేలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాజకీయ విభేదాలకు అతీతంగా ప్రాంత ప్రయోజనాల కోసం ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

అనవసర రాజకీయ విమర్శలు వద్దు

ప్రతి అంశంలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అనవసరంగా లక్ష్యంగా చేసుకోవద్దని అనిరుధ్‌రెడ్డి హితవు పలికారు. ప్రాజెక్టుల విషయంలో పరస్పర విమర్శలకు పరిమితం కాకుండా పాలమూరుకు నీరు అందేలా సమష్టి కృషి చేయాలని సూచించారు. నీటి హక్కుల సాధన కోసం అవసరమైనప్పుడు గట్టిగా నిలబడతానని ఆయన స్పష్టం చేశారు.

కోల్‌కతా దుర్గా పూజా మండపం వద్ద తొక్కిసలాట

- 17 మందికి పైగా మృతి?
- నార్త్ కోల్‌కతాలోని చోర్ భగన్ పూజా మండపం వద్ద ఘటన
- భారీ వర్షంతో ఒక్కసారిగా పెరిగిన భక్తుల రద్దీ
- 35 మందికి పైగా గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- భద్రతా కారణాలతో పూజా మండపం మూసివేత
- సహాయక చర్యల్లో పోలీసులు, అగ్నిమాపక, వైద్య బృందాలు

కోల్‌కతా, ప్రజా వాయిస్: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని నార్త్ కోల్‌కతాలో తీవ్ర విషాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. చోర్ భగన్ సార్వజనిన్ దుర్గా పూజా మండపం వద్ద తొక్కిసలాట జరిగినట్లు వచ్చిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలో 17 మందికి పైగా మృతి చెందగా, మరో 35 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంఖ్యలను అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

భారీ వర్షంతో పెరిగిన రద్దీ

అక్టోబర్ 17న రాత్రి 7.40 గంటల సమయంలో శారదా పార్క్‌లోని నిష్క్రమణ ద్వారం వద్ద ఈ ఘటన జరిగినట్లు సమాచారం. భారీ వర్షం కారణంగా భక్తులు ఒక్కసారిగా చోర్ భగన్ దుర్గా పూజా మండపంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తొక్కిసలాట చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపినట్లు వార్తలు వెలువడ్డాయి. గాయపడిన వారిని సమీపంలోని ఎంసీహెచ్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

సహాయక చర్యలు ముమ్మరం

భద్రతా కారణాల దృష్ట్యా పూజా మండపాన్ని మూసివేసినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, అంబులెన్స్‌లు, వైద్య బృందాలను మోహరించి సహాయక చర్యలు చేపట్టినట్లు సమాచారం.

గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అగర్వాల్ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించినట్లు కథనాలు పేర్కొన్నాయి. క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.మరోవైపు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, మృతుల కుటుంబాలకు ఈ కష్టకాలాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇవ్వాలని దుర్గామాతను ప్రార్థిస్తున్నట్లు ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నట్లు సమాచారం.

ఉద్యోగం పేరుతో వంచన.. మహిళపై లైంగిక దాడి

హైదరాబాద్, ప్రజా వాయిస్: ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఇంటి పని ఇప్పిస్తానంటూ నమ్మించిన ఓ యువకుడు మహిళను ఆటోలో తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మాయమాటలు చెప్పి ఆటోలో తీసుకెళ్లి..

పోలీసుల వివరాల ప్రకారం.. రాయదుర్గం నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న మహిళను ఓ యువకుడు మాటల్లో పెట్టాడు. ఇంటి పని ఇప్పిస్తానని నమ్మించి ఆటో ఎక్కించుకున్నాడు. తాను భర్తకు చెప్పి వస్తానని మహిళ చెప్పినా, ఆమెను మాటలతో నమ్మించి అక్కడి నుంచి తీసుకెళ్లినట్లు సమాచారం. అనంతరం జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 51లోని చెట్లు దట్టంగా ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిందితుడి కోసం పోలీసుల గాలింపు

బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెను వైద్య చికిత్స నిమిత్తం అమీర్‌పేటలోని యూసీహెచ్‌కు తరలించారు. నిందితుడి ఆచూకీ గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాస్టర్ కీతో బైక్‌ల చోరీ.. ఇద్దరు అరెస్ట్

- మెట్రో స్టేషన్లు, ప్రధాన కూడళ్లే లక్ష్యంగా దొంగతనాలు
- రూ.5 వేల నుంచి రూ.10 వేలకే స్కూటర్ల విక్రయం
- ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన ఎల్బీనగర్ పోలీసులు
- నిందితుల నుంచి 15 యాక్టివా స్కూటర్లు స్వాధీనం
- ఎల్బీనగర్, మీర్‌పేట్ సహా పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు

హైదరాబాద్, ప్రజా వాయిస్: నగరంలో ప్రధాన కూడళ్లు, మెట్రో స్టేషన్ల వద్ద పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను మాస్టర్ కీతో దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 15 యాక్టివా స్కూటర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నగరంలోని పలు ప్రాంతాల్లో వాహన చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

మాస్టర్ కీతో చోరీలు

పోలీసుల కథనం ప్రకారం.. తంగుటూరి సంజీవ కుమార్ (46), మల్లాడ గంగాధర్ శ్రీ నాగవర్మ (49) నగరంలోని ప్రధాన కూడళ్లు, మెట్రో స్టేషన్ల వద్ద నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలను లక్ష్యంగా చేసుకునేవారు. మాస్టర్ కీ సహాయంతో స్కూటర్లను దొంగిలించి, అనంతరం వనస్థలిపురం పరిసర ప్రాంతాల్లో విక్రయించేవారు. ఒక్కో స్కూటర్‌ను రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అమ్మి, ఆ డబ్బుతో జల్సాలు చేసేవారని పోలీసులు తెలిపారు.

సీసీటీవీ ఫుటేజీతో పట్టివేత

అక్టోబర్ 10న ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద పార్క్ చేసిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి స్కూటర్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. ఎల్బీనగర్, మీర్‌పేట్, అఫ్జల్‌గంజ్, జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ వీరిపై పలు కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.

వాహనదారులకు పోలీసుల సూచనలు

స్వాధీనం చేసుకున్న 15 స్కూటర్ల యజమానులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. వాహనదారులు తాళం చెవులను వాహనాల వద్ద వదిలివేయకుండా, హ్యాండిల్ లాక్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. వీలైతే జీపీఎస్ ఆధారిత పరికరాలను వినియోగించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

దసరా ప్రయాణ కష్టాలు.. బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు

హైదరాబాద్, ప్రజా వాయిస్: దసరా పండుగ నేపథ్యంలో భాగ్యనగర వాసులు సొంతూళ్లకు పయనమవుతున్నారు. దీంతో నగరంలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. శనివారం తెల్లవారుజాము నుంచే జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్)లో రద్దీ క్రమంగా పెరిగింది. ప్రత్యేక బస్సులు సమయానికి అందుబాటులోకి రాకపోవడంతో ప్రయాణికులు గంట ల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు ఛార్జీల వసూలుపై ఆరోపణలు

ప్రత్యేక బస్సుల్లో 40 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారని కొందరు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పండుగ వేళ రద్దీ పెరగడంతో సొంతూళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. శనివారం సాయంత్రం నుంచి ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

7 వేల ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాలకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అక్టోబర్ 17, 18, 19 తేదీల్లో అవసరాన్ని బట్టి అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 95 శాతం ప్రత్యేక బస్సుల నిర్వహణ ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు.

రద్దీపై ఎండీ పర్యవేక్షణ

జేబీఎస్, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), ఉప్పల్, ఎల్బీనగర్ బస్టాండ్లలో పరిస్థితిని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నేరుగా పర్యవేక్షిస్తున్నారు. బస్సుల నిర్వహణ, ట్రాఫిక్ పరిస్థితులపై అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. బస్టాండ్లలో తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, పారిశుధ్యం, భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దసరా అనంతరం నగరానికి తిరిగి వచ్చే ప్రయాణికుల కోసం కూడా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

జంతర్ మంతర్ హింసపై ఫిర్యాదులకు ప్రత్యేక పోర్టల్

- సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు
- బాధితులు, పోలీసు సిబ్బంది నుంచి ఫిర్యాదుల స్వీకరణ-పెల్లెట్ గన్స్ వినియోగం, మహిళలపై దాడులపైనా విచారణ
- బాధితుల గుర్తింపు గోప్యంగా ఉంచేందుకు ఏర్పాట్లు
- ఆన్‌లైన్, ఈ-మెయిల్, పోస్టు ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం

న్యూఢిల్లీ, ప్రజా వాయిస్: ఢిల్లీలోని జంతర్ మంతర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది జూలైలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన ఉన్నతస్థాయి విచారణ కమిటీ (హెచ్‌పీఈసీ) ఈ పోర్టల్‌ను ప్రారంభించింది. బాధితులు, పోలీసు సిబ్బంది తమ ఫిర్యాదు లు, వినతిపత్రాలను సమర్పించేందుకు వీలుగా hpec.nic.in వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది.

అన్ని కోణాల్లో విచారణ

జూలైలో జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించిన అన్ని అంశాలపై కమిటీ విచారణ చేపట్టనుంది. పెల్లెట్ గన్స్ వినియోగం, మహిళా నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడులు, వేధింపులపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఇరు వర్గాల నుంచి జరిగిన హింస, ఆస్తుల విధ్వంసానికి సంబంధించిన అంశాలను కూడా పరిశీలించనుంది.

గుర్తింపు గోప్యంగా ఉంచే అవకాశం

బాధితులు తమ ఫిర్యాదులు, ఆధారాలు, వినతిపత్రాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ఫిర్యాదుదారులు కోరుకుంటే వారి గుర్తింపును గోప్యంగా ఉంచే లా ఏర్పాట్లు చేశారు. బలహీన వర్గాలకు చెందిన సాక్షులకు తగిన రక్షణ కల్పించే చర్యలూ చేపట్టారు. ఘటనలకు సంబంధించిన సమాచారం లేదా సూచనలు అందించాలనుకునే ఇతరులకు కూడా అవకాశం కల్పించారు.

ఆఫ్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చు

ఆన్‌లైన్‌తో పాటు పోస్టు, ఈ-మెయిల్ ద్వారా కూడా ఫిర్యాదులు పంపవచ్చని కమిటీ తెలిపింది. భౌతికంగా ఫిర్యాదు చేయాలనుకునేవారు న్యూఢిల్లీలోని హెచ్‌పీఈసీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.కార్యాలయ చిరునామా: శిక్షా సదన్, 17, రౌస్ అవెన్యూ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, న్యూఢిల్లీ–110002.ఫిర్యాదుల స్వీకరణ సమయం: పని దినాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు.వెబ్‌సైట్: https://hpec.nic.in/ఈ-మెయిల్: hpec2026.enquiry@nic.in

కోదాడ సంతలో ఇష్టారాజ్యం

- రసీదులు ఇవ్వకుండానే వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు
- రైతులకు కనీస వసతులు కరువు
- పశువులకు తాగునీరు ఉండదు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు మాయం..
- సంతను పట్టించుకునే వారేరీ.?

ప్రజా వాయిస్,కోదాడ: ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో కీలక పట్టణమైన కోదాడలో నిర్వహించే పశువుల సంత చుట్టుపక్కల ప్రాంతాల్లోనే అతిపెద్ద సంతల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రతి వారం ఈ సంతకు పెద్ద సంఖ్యలో రైతులు, పశువుల వ్యాపారులు తరలివస్తుంటారు. అయితే ఇంతటి ప్రాధాన్యత కలిగిన సంతలో రైతులకు కనీస సౌకర్యాలు లేకపోవడం, నిర్వహణ తీరుపై ఆరోపణలు వెల్లువెత్తడం ఆందోళన కలిగిస్తోంది.

రసీదులు లేకుండా వసూళ్ల ఆరోపణలు

సంతలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల కొనుగోలు, అమ్మకాల సమయంలో రసీదులు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. రసీదులు ఇవ్వకుండా వసూలు చేస్తున్న సొమ్ము ఎవరికి చేరుతోంది. సంతలో జరిగే లావాదేవీలకు అధికారిక లెక్కలు ఉన్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

పశువులకు నీళ్లు లేవు.. రైతులకు వసతులు లేవు

పశువుల కొనుగోలు, అమ్మకాల కోసం దూర ప్రాంతాల నుంచి సంతకు వచ్చే రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఎండలో గంటల తరబడి ఉండే పశువులకు సరిపడా తాగునీటి సదుపాయం లేకపోవడం ఆందోళనకరం. పశువులకు నీటి వసతి కల్పించాల్సిన బాధ్యతను నిర్వాహకులు ఎందుకు విస్మరిస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఇంత పెద్ద సంతలో మరుగుదొడ్లు ఎక్కడ.?

వందలాది మంది రైతులు, వ్యాపారులు రాకపోకలు సాగించే సంతలో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేకపోవడం దుస్థితికి అద్దం పడుతోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటోంది. పారిశుధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఆదాయం వస్తోంది.. అభివృద్ధి మాత్రం ఏదీ.?

సంత ద్వారా ఆదాయం సమకూరుతున్నప్పటికీ, అందుకు తగ్గట్టుగా మౌలిక వసతులు ఎందుకు కల్పించడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సంత నిర్వహణకు సంబంధించిన ఆదాయం, వసూళ్లు, ఖర్చుల వివరాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల దృష్టికి ఈ సమస్యలు వెళ్లేనా.?

కోదాడ పశువుల సంతలో రసీదుల జారీ, వసూళ్ల విధానం, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యంపై సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించాలి. సంత నిర్వహణలో పారదర్శకత తీసుకురావడంతో పాటు రైతులు, పశువుల వ్యాపారులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలి.రైతుల చెమటకు విలువ లేదా పశువుల సంతలో వసూళ్లపై ఆరోపణలకు సమాధానం చెప్పేదెవరు కోదాడ సంత నిర్వహణపై అధికారులు ఇప్పటికైనా స్పందించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి సమస్యలను పరిష్కరిస్తారా అన్నది వేచి చూడాలి.

మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం:వ్యవసాయ కార్యదర్శి ఖాజా మొహీనుద్దీన్

కోదాడ పశువుల సంతపై వస్తున్న ఆరోపణల గురించి వ్యవసాయ కార్యదర్శి ఖాజా మొహీనుద్దీన్‌ను వివరణ కోరగా, రసీదులు ఇవ్వకుండా బండ్లను బయటకు వెళ్లనివ్వడం వంటి ఘటనలు తమ దృష్టికి రాలేదని తెలిపారు. తమ వద్ద అలాంటి పరిస్థితులు లేవని, ఎవరైనా ఈ విధంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే శుక్రవారం నీటి తొట్టెలను నింపి శనివారం, ఆదివారం కూడా నీరు నిండుగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, పశువులకు నీటి కొరత లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు.

వరంగల్‌లో భర్త హత్య కేసులో సంచలన తీర్పు

భార్య సహా 10 మందికి యావజ్జీవ కారాగార శిక్ష

.ప్రజా వాయిస్,వరంగల్.వైవాహిక వివాదాల నేపథ్యంలో జరిగిన దత్తు శ్రీనివాస్ హత్య కేసులో వరంగల్ జిల్లా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో భార్య రమ్యశ్రీతో పాటు మరో తొమ్మిది మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ తీర్పు ఇచ్చినట్లు సమాచారం. రంగంపేటకు చెందిన దత్తు శ్రీనివాస్‌కు వరంగల్ నగరంలోని రంగశాయి పేటకు చెందిన బజ్జూరి రమ్యశ్రీతో 2015లో వివాహం జరిగింది. అయితే పెళ్లయిన కొద్దికాలానికే ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో

రమ్యశ్రీ పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం భర్త, ఆయన కుటుంబ సభ్యులపై పలు కేసులు నమోదు చేయడంతో ఇరువర్గాల మధ్య వివాదాలు కొనసాగాయి.ఈ క్రమంలో 2024 ఫిబ్రవరి 13న బొడ్రాయి పండుగ సందర్భంగా సమస్యలను పరిష్కరించుకుందామంటూ శ్రీనివాస్‌ను అత్తింటి వారు ఆహ్వానించినట్లు సమాచారం. భార్యతో తిరిగి కాపురం చేసుకోవచ్చనే ఆశతో అక్కడికి వెళ్లిన శ్రీనివాస్ ఘర్షణలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కేసు విచారణలో కీలక సాక్ష్యాలుగా మారినట్లు తెలిసింది.పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నేరం రుజువైనట్లు నిర్ధారించి, భార్య రమ్యశ్రీతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితురాలు అలేఖ్య సహా మొత్తం పది మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు సమాచారం.

ఇండ్లు లేని పేదలు ఉండొద్దన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

జా వాయిస్, మిర్యాలగూడ.తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని శాసన మండలి సభ్యుడు, ఆదివాసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం దామరచర్ల మండలం నూనావత్ తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, గృహప్రవేశం చేసిన నూనావత్ రామచంద్రు, శారద దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సైదా నాయక్, వెంకన్న, బాలు, బాబు, రాము, బాలు ధర్మ, ఉపేందర్, మేఘ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అడ్వైజరీ మెమో

- ఉర్సు రంగాలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల రోజున ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు.
- వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి ఉర్సు రంగాలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా తేది; 20-10-2026 మధ్యాహ్నం 03:00 గంటల నుండి తేది; 21-10-2026 ఉదయం 03:00 గంటల వరకు ట్రై సిటి పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు.ఖమ్మం నుండి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు పున్నెలు క్రాస్ నుండి ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్లవలెను. కరీంనగర్ నుండి ఖమ్మం వెళ్ళవలసిన వాహనాలు, కే. యూ. సి, పెద్దమ్మ గడ్డ, హనుమాన్ జంక్షన్, పోచం మైదాన్, కాశిబుగ్గ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్ రోడ్ జంక్షన్ మీదుగా వెళ్లవలెను, హైదరాబాద్ నుండి ఖమ్మం వెళ్ళవలసిన వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నెలు క్రాస్ నుండి వెళ్లవలెను.ఉర్సు గుట్టకు వచ్చే వాహనాల కోసం క్రింది ప్రదేశాలలో పార్కింగ్ ఏర్పాటుచేయడము జరిగినదిహన్మకొండ హంటర్ రోడ్ నుండి ఉర్సు గుట్టకు వచ్చే వాహనాలు కొలంబో హాస్పిటల్, BR నగర్ ఎదురుగా గానుగ ఆయిల్ పాయింట్ దగ్గర,ఆకుతోట ఫంక్షన్ హాల్, నాని గార్డెన్ మరియు JSM స్కూల్ నందు మీ యొక్క వాహనాలను పార్కింగ్ చేయగలరు.కడిపికొండ నుండి వచ్చే వాహనాలు భారత్ పెట్రోల్ పంపు దగ్గర పార్కింగ్ చేయగలరు,RTO జంక్షన్ నుండి వచ్చే వాహనాలు, లష్మీ ఫంక్షన్ హాల్ ఒపెన్ ప్లేస్, తాళ్ల పద్మావతి కాలేజ్ దగ్గర పార్కింగ్ చేయగలరు,కరీమాబాద్ నుండి వచ్చే వాహనాలు భీరన్న గుడి దగ్గర పార్కింగ్ చేయగలరని , వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ప్రజలందరూ సహకరించాలని కోరారు.

రూ.37.50 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
- ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి / ప్రజా వాయిస్: మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధి లోని పలు వార్డుల్లో రూ.37.50 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జాము రవి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా మున్సిపాలిటీ పరిధిలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

పలు వార్డుల్లో అభివృద్ధి పనులు...

మున్సిపాలిటీ పరిధిలోని 4, 6వ వార్డుల్లో రూ.5 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. 16, 17, 18, 19వ వార్డుల్లో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, మట్టి రోడ్ల అభివృద్ధి, వైకుంఠధామం మరమ్మతులు, వాటర్ పైప్‌లైన్ పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా 13, 14, 15వ వార్డుల్లో రూ.7.50 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వాటర్ పైప్‌లైన్ పనులు చేపట్టనున్నారు. 20, 24వ వార్డుల్లో రూ.5 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు, 22, 23వ వార్డుల్లో రూ.5 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు, 11, 12వ వార్డుల్లో మరో రూ.5 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ పనులు పూర్తయితే ఆయా వార్డుల్లో రహదారుల పరిస్థితి మెరుగుపడటంతో పాటు మురుగునీటి సమస్యలు తగ్గి, తాగునీటి సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడే అవకాశం ఉంది. దీంతో స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రజా అవసరాలకు ప్రాధాన్యం...

మున్సిపాలిటీ పరిధిలోని కొల్తూర్, మూడుచింతలపల్లి, జగన్‌గూడ, కేశవరం, అద్రాస్‌పల్లి, పొన్నాల ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మోర్సుబాయి శశిరేఖ, కౌన్సిలర్లు ర్యాకల నీరజ్ గౌడ్, గిరిపల్లి రమేష్, గిరిపల్లి జ్యోతి, గుండ్లపల్లి మహేశ్వరి, చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి, గూడ జంగారెడ్డి, ఇర్రి స్వప్న, కొంపల్లి మాధవి, ఆది అజయ్ కుమార్, పులి ప్రభాకర్, కొల్లాస్ రాజు, మడబోయిన మౌనిక, మున్సిపల్ డీఈ స్ఫూర్తి, నాయకులు మల్లేష్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, దత్తు గౌడ్, రాంరెడ్డి, స్వామి, యాదగిరి, నర్సింలు, రవీందర్ రెడ్డి, నవీన్, నాగరాజు, సంజీవ, వెంకటేష్, బలరాం, ప్రభాకర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న ఆపన్నహస్తం

- యువతికి సకాలంలో వైద్యం
- బస్సులో యువతి స్పృహ కోల్పోవడంతో ఆసుపత్రికి తరలింపు
- మానవత్వం చాటుకున్న అబ్దుల్ హకీమ్

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఓ యువతి తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ కోల్పోగా, తోటి ప్రయాణికుడు అబ్దుల్ హకీమ్ తక్షణమే స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకుని మానవత్వాన్ని చాటుకున్నారు.వివరాల్లోకి వెళ్తే.. శనివారం హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ సమీపానికి చేరుకోగానే అందులో ప్రయాణిస్తున్న ఓ యువతి కి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి కిందపడిపోయి స్పృహ కోల్పోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు.అదే బస్సులో ప్రయాణిస్తున్న అబ్దుల్ హకీమ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించి, యువతిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వెంటనే అత్యవసర వైద్య సేవలు అందించడంతో ఆమె పరిస్థితి విషమించకుండా సురక్షితంగా బయటపడింది.ఆపద సమయంలో మానవతా దృక్పథంతో స్పందించి యువతికి సకాలంలో వైద్యం అందేలా కృషి చేసిన అబ్దుల్ హకీమ్‌ను స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది, తోటి ప్రయాణికులు అభినందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమని ఆయన తన చర్యతో నిరూపించారని పలువురు ప్రశంసించారు.

నల్లమల్లలో మెరిసిన విద్యా కుసుమం

తండ్రి చిరకాల ఆశను నిజం చేసిన కూతురు
బార్బర్ షాప్ లో పనిచేస్తూ కూతుర్ని చదివించిన తండ్రి
డాక్టర్ కాబోతున్న కూతురు

***ప్రజా వాయిస్ అచ్చంపేట** అక్టోబర్ 17 నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కేంద్రానికి చెందిన జంపుల విద్య కాళోజి నారాయణ రావు యూనివర్సిటీ వరంగల్ లో ప్రభుత్వ ఎంబిబిఎస్ సీటు సాధించి పేదరికం ఉన్న ఎన్నో అడ్డంకులు ఎదురైన పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిరూపించిన జంపుల విద్య తండ్రి జంపల గణేష్ కటింగ్ షాప్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న తండ్రి జంపుల గణేష్ తన కుమార్తె ఉన్నత చదువుల కోసం పడిన కష్టం నేడు ఫలించింది. ఎన్నో ఆశలతో కుమార్తెను చదివించిన ఆయనకు, జంపుల విద్యకు ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు సాధించడంతో కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.కష్టపడి పనిచేస్తూ కుమార్తె భవిష్యత్తుకు బాటలు వేసిన తండ్రి జంపుల గణేష్ కటింగ్ షాప్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజంతా కష్టపడి పనిచేస్తూ కుటుంబ అవసరాలను తీర్చడంతో పాటు, తన కుమార్తె విద్యాభ్యాసానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవడానికి శ్రమించారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, కుమార్తె బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ఆమెను ప్రోత్సహించారు.తన కష్టాన్ని లెక్కచేయకుండా కుమార్తె చదువే తనకు ముఖ్యమని భావించిన తండ్రి గణేష్, ఆమె భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేశారు. తండ్రి పడుతున్న కష్టాన్ని అర్థం చేసుకున్న విద్య. కూడా చదువుపై దృష్టి సారించి, తన లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగింది.ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటుతో సాకారమైన కలవిద్య. కష్టపడి చదివి ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు సాధించడం కుటుంబానికి మరిచిపోలేని విజయంగా నిలిచిందని. కుమార్తెను డాక్టర్‌గా చూడాలన్న తండ్రి ఆశలకు ఈ విజయం కొత్త ఊపిరినిచ్చిందని తన రెక్కల కష్టంతో కుమార్తెను చదివించిన తండ్రి సంతోషం వ్యక్తం చేశాడు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు విద్యను అభినందించారు.

Kaloji Narayana Rao University of Health Sciences, Telangana
Warangal
UNDER GRADUATE MEDICAL/DENTAL ADMISSIONS - 2026-27
Competent Authority Quota(CQ)
PROVISIONAL ALLOTMENT ORDER(MBBS) - PHASE - P2

ఉపయోగంలోకి రాని కూరగాయల మార్కెట్.. నిరుపయోగంగా ప్రజాధనం!

- పాపన్నపేట మండలంలో దర్శనమిస్తున్న అధికారుల నిర్లక్ష్యం!
- రహదారిపైనే వ్యాపారాలు.. ఇబ్బందుల్లో స్థానికులు, వాహనదారులు!
- వెంటనే మార్కెట్ ను అందుబాటులోకి తేలాలని ప్రజల విజ్ఞప్తి!

ప్రజా వాయిస్,పాపన్నపేట.....పాపన్నపేట మండల పరిధిలో ప్రజల, వ్యాపారుల సౌకర్యార్థం లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కూరగాయల మార్కెట్ (వెజిటబుల్ మార్కెట్ షెడ్) నేడు అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణా రాహిత్యం వల్ల వృధాగా మారుతోంది. నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా మార్కెట్‌ను వినియోగంలోకి తేకపోవడంతో నిర్మాణాలు పాడైపోయే స్థితికి చేరుకున్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపైనే విక్రయాలు.. తప్పని ట్రాఫిక్ కష్టాలు

కూరగాయల మార్కెట్ అందుబాటులోకి రాకపోవడంతో స్థానిక వ్యాపారులు, రైతులు ప్రధాన రహదారుల పక్కన, మురుగుకాలువల సమీపంలోనే కూరగాయలు విక్రయించాల్సి వస్తోంది. దీనివల్ల నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. వర్షాకాలంలో రోడ్డుపై బురద, దుర్గంధం మధ్య వ్యాపారాలు చేయాల్సి వస్తోందని కొనుగోలుదారులు వాపోతున్నారు.

రూ. లక్షల ప్రజాధనం వృధా!

కూరగాయల విక్రేతలకు, రైతులకు నీడ, విద్యుత్, తాగునీటి సదుపాయాలతో కూడిన ప్రత్యేక వేదికను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిధులు కేటాయించి ఈ భవనాన్ని నిర్మించింది. కానీ, పాలకులు, అధికారులు దీనిని ప్రారంభించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సరైన రక్షణ లేకపోవడంతో మార్కెట్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సబ్బండ వర్గాల ఐక్యతే " బతుకమ్మ " పండుగ

- తెలంగాణ అస్తిత్వం బతుకమ్మ
- సుప్రసిద్ధ చిత్రకారులు ఎం.డి రుస్తుం

ప్రజా వాయిస్ /దుబ్బాక: తెలంగాణ అస్తిత్వం ప్రపంచంలోనే ప్రత్యేకతను సంతరించుకున్న ప్రకృతి పరువం 'బతుకమ్మ పండుగ ఫ్లవర్ ఫెస్టివల్' పండుగను పురస్కరించుకుని నేడు రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో "కలసిమెలసి బతుకమ్మ" చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. పండుగలు సమాజాలను కళావంతం చేస్తాయని, సద్దుల బతుకమ్మ పండుగ బంగారు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ఆడపడుచుల ఆట పాటలతో సబ్బండ వర్ణాల ఐకమత్యాన్ని సహజీవన సౌందర్యాన్ని పెంపొందించి ప్రకృతి కి పెద్దపీట వేస్తుంది, రంగు రంగుల పువ్వల్లే కలసిమెలసి బతుకమ్మ, బతుకమ్మ మనబతుకు బతుకమ్మా, మన తెలంగాణ అస్తిత్వం బతుకమ్మ.. ఫ్లవర్ ఫెస్టువల్ అన్నార్థుల బాధలను అధిగమించాలని, నిరుద్యోగ, అణచివేత బాధితుల బాధలు తొలగాలని, దేశ నలుమూలల శాంతిని సంతోషాలను సహజీవనాన్ని ఇకమత్యాన్ని కోరుకుంటుందని కలర్ఫుల్ బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వం, మన ముఖ్యమంత్రి ఆడపడుచులకు బతుకమ్మ పండుగ కానుకగా చీరెలు ఇవ్వాలని యావత్ ప్రపంచం ఎదురుచూస్తున్నదని, ప్రఖ్యాత మానవతా చిత్రకారులు రుస్తుం తెలియజేశారు. ఆర్ ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖ రుస్తుం నైరూప్య చిత్రకారులు నహీంరుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబినారుస్తుం, రహీమ్, కొండ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వాయిస్ పత్రికా కథనానికి తక్షణ స్పందన

చిన్న ఉమ్మెంత్యాల – కొందుర్గ్ ప్రధాన రహదారి దారుణమైన దుస్థితిపై ప్రజా వాయిస్ కథనానికి రోడ్డు మరమ్మతులు ప్రారంభం

ప్రజా వాయిస్
శంకుస్థాపన చేసి రెండు నెలలైనా ప్రారంభం కాని చిన్న ఉమ్మెంత్యాల పనులు

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)చిన్న ఉమ్మెంత్యాల – కొందుర్గ్ ప్రధాన రహదారి దారుణమైన దుస్థితిపై "ప్రజా వాయిస్" దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్థానిక అధికార యంత్రాంగం తక్షణమే స్పందించిందిగుంతలమయంగా మారి, ప్రతినిత్యం ప్రయాణికులు మరియు వాహనదారులను నరకయాతనకు గురిచేస్తున్న ఈ రోడ్డుపై అధికారులు నేరుగా పరిశీలన జరిపి, జేసీబీలతో మరమ్మతు పనులను వేగవంతం చేశారు ప్రజల ఇబ్బందులు, నిత్య ప్రమాదాల ముప్పును వెలుగులోకి తెస్తూ "ప్రజా వాయిస్" అందించిన కథనం పాలనలో కదలిక తెచ్చింది అధికారుల ఆదేశాలతో జేసీబీలు రంగంలోకి దిగి, రోడ్డుపై ఉన్న భారీ గుంతలను పూడ్చే పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు ప్రజా సమస్యపై త్వరితగతిన స్పందించి పనులు ప్రారంభించేలా చేసిన "ప్రజా వాయిస్" పత్రికకు, అలాగే వెంటనే చర్యలు చేపట్టిన అధికారులకు స్థానిక గ్రామాల ప్రజలు, వాహనదారులు ధన్యవాదాలు తెలిపారు కేవలం తాత్కాలిక గుంతల పూడ్చివేతకే పరిమితం కాకుండా, ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా నాణ్యమైన శాశ్వత బీటీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మిర్యాలగూడ రూరల్ ఎస్ఐగా ఉప్పు నగేశ్ బాధ్యతల స్వీకరణ

ప్రజలకు అందుబాటులో ఉంటా.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

ప్రజా వాయిస్,మిర్యాలగూడ: మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఉప్పు నగేశ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఎం. లక్ష్మయ్య నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మహిళలు, బాలల భద్రతకు ప్రాధాన్యమివ్వడంతో పాటు ఇసుక అక్రమ రవాణా, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకుంటానన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. కాగా, గత ఏడాదిన్నర కాలంగా మిర్యాలగూడ రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహించిన ఎం. లక్ష్మయ్య తనకు సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన ఎస్ఐ నగేశ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

జైపూర్ మండలంలో యథేచ్ఛగా ఇసుక దందా

- మండల కేంద్రాల్లోనే ఈ పరిస్థితి ఉంటే గ్రామాల పరిస్థితి ఏమిటో?
- పట్టపగలే ప్రధాన రహదారులగుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలింపు.
- దుబ్బపల్లి వాగులో యథేచ్ఛగా ఇసుక దోపిడీ..
- ప్రభుత్వ ఆదాయానికి గండి.

ప్రజా వాయిస్ జైపూర్.మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో అక్రమ ఇసుక రవాణా తారాస్థాయికి చేరింది. ఎటువంటి అనుమతులు, పర్మిట్లు లేకుండా మండలంలోని దుబ్బపల్లి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. గతంలో రాత్రులు జరిగే ఈ అక్రమం పట్టపగలే ప్రధాన రోడ్లపై ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ బహిరంగంగా అమ్మకాలు సాగిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఇసుక ట్రాక్టర్లు స్వేచ్ఛగా తిరుగుతున్నా అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం, తనిఖీలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇసుక మాఫియాకు కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ప్రకృతి సంపదను దోచుకుంటున్నా పట్టించుకోకపోవడంపై మండల కేంద్రంలోనే ఈ పరిస్థితి నెలకొంటే ఈ గ్రామాల పరిస్థితి ఏమై ఉంటుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆల్ స్టేట్స్ పోలీస్ బైక్ ర్యాలీకి ఐఐటీ హైదరాబాద్‌లో ఘన స్వాగతం

- 'ఏక్ థా దివాస్' కార్యక్రమంలో భాగంగా ఐఐటీ హైదరాబాద్ లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం
- మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టడంలో యువత కీలక పాత్ర పోషించాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

జా వాయిస్ సంగారెడ్డి : ఏక్ థా దివాస్'' కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లోని ఐసీసీసీ నుంచి గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వరకు నిర్వహిస్తున్న ఆల్ స్టేట్స్ పోలీస్ బైక్ ర్యాలీకి ఐఐటీ హైదరాబాద్‌లో ఘన స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అనంతరం ఐఐటీ హైదరాబాద్‌లో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత తమ జీవితాల్లో అనేక దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసలైన వారి ఆరోగ్యం, భవిష్యత్తు, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజానికి కూడా తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ, తమ స్నేహితులు, తోటి విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు.ఈగల్ టీమ్ డీఎస్పీ పుష్పన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్, ఎంఎన్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐఐటీ హైదరాబాద్ డీన్ డా. ప్రశాంత్ కుమార్, డీన్ డా. ప్రేమ్ పాల్,, డీఎస్పీలు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల కల సాకారం..

- రూ.2.10 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం
- రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం
- మహిళా సమాఖ్య భవనం ప్రారంభం
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ.
- దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్

ప్రజా వాయిస్, పీఏ పల్లి: రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. పీఏ పల్లి మండలం మేడారం గ్రామ పరిధిలోని రంగారెడ్డి గూడెంలో రూ.2.10 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. పీఏ పల్లి మండలానికి చెందిన కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగారెడ్డి గూడెం ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నది స్థానిక ప్రజలు, రైతుల పదేళ్ల కల అని, నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో ఆ కల నెరవేరిందని పేర్కొన్నారు. దీని ద్వారా పరిసర ప్రాంతాల రైతులకు విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు లో–వోల్టేజీ, అధిక లోడ్ సమస్యలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యల కారణంగా రైతులు పంట నష్టపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. మహిళా సమాఖ్య భవనం ప్రారంభం సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు, రుణాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. అనంతరం కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నెర్మటి సతీష్‌రెడ్డి, ఏవీ రెడ్డి, సత్యం రెడ్డి, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ఎలుగూరి జయమ్మ, భాస్కర్‌రెడ్డి, గొంగడాల వెంకటయ్య, రాగం అంజయ్య, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మావిళ్ల లక్ష్మీనారాయణ యాదవ్, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, మద్దిమడుగు రామస్వామి, కొర్ర రాంసింగ్, మండల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూల్చివేతలకు అడ్డంకులు.. అధికారులతో స్థానికుల వాగ్వాదం.!

- శంషాబాద్ మధురానగర్ లో హైటెన్షన్
- అక్రమ నిర్మాణాల తొలగింపునకు తీవ్ర ప్రతిఘటన
- "మీ ప్రాపర్ ఎక్కడ.? కూల్చేందుకు మీరెవరు.? మీకేం అధికారం ఉంది.?"
- అంటూ అధికారులను నిలదీసిన స్థానికులు
- 'ఎలా కూల్చుతారో కూల్చండి' అంటూ సవాల్
- బెదిరింపుల ఆరోపణలతో ఉద్రిక్తత..
- రంగంలోకి దిగి ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు

ప్రజావాయిస్// రాజేంద్రనగర్: శంషాబాద్ మధురానగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వచ్చిన టౌన్‌ప్లానింగ్,విజిలెన్స్ అధికారులకు స్థానికుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది.కూల్చివేత చర్యలను అడ్డుకున్న కొందరు స్థానికులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడ ఒక్కసారిగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. నిర్మాణాల తొలగింపు కోసం వచ్చిన అధికారులను స్థానికులు నిలదీయడంతో పరిస్థితి మరింత వేడెక్కింది.

మీ ప్రాపర్ ఎక్కడ? కూల్చేందుకు మీరెవరు.?

మీకేం అధికారం ఉంది.?"అంటూ కొందరు స్థానికులు అధికారులను ప్రశ్నించినట్లు నిలదీశారు.అంతటితో ఆగకుండా,ఎలా కూల్చుతారో కూల్చండి, అంటూ సవాల్ విసరడంతో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులను అడ్డుకోవడంతో పాటు బెదిరింపులకు దిగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.అక్రమ నిర్మాణాల తొలగింపునకు వచ్చిన అధికారులకు స్థానికుల నుంచి ఎదురైన ప్రతిఘటనతో క్షేత్రస్థాయిలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.

అధికారులను అడ్డుకున్న స్థానికులు..రంగంలోకి పోలీసులు

కూల్చివేతల విషయంలో వాగ్వాదం ముదరడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు.పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఆందోళనకారులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.దీంతో కొంతసేపు కొనసాగిన ఉద్రిక్తతకు తెరపడింది. అయితే,అక్రమ నిర్మాణాల తొలగింపు సందర్భంగా చోటుచేసుకున్న ఈ పరిణామాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

అక్రమ నిర్మాణాలపై చర్యలకు ప్రతిఘటన - తదుపరి అడుగు ఎటు?

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తిస్తే వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది.అదే సమయంలో, కూల్చివేతలకు సంబంధించి అనుమతులు,నోటీసులు, సంబంధిత నిబంధనల అమలు వంటి అంశాలపై స్పష్టత అవసరం. మధురానగర్‌లో అధికారులను స్థానికులు అడ్డుకోవడం,ప్రశ్నించడం, వాగ్వాదానికి దిగడం ఘటనను మరింత ప్రాధాన్యంగా మార్చింది.అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే క్రమంలో అధికారులు ఎదుర్కొన్న ఈ ప్రతిఘటనకు సంబంధిత యంత్రాంగం ఎలా స్పందిస్తుంది.? కూల్చివేతల విషయంలో తదుపరి ఎలాంటి చర్యలు చేపడతారు.? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఈ ఘటనపై సంబంధిత అధికారులు అధికారికంగా స్పందిస్తే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

అభివృద్ధి పనుల ప్రారంభం.. బాధిత మహిళకు ఆర్థిక భరోసా

- రూ.30 లక్షలతో నారాయణపురంలో నూతన భవనాలు ప్రారంభం
- ప్రమాద బాధితురాలికి రూ.30 వేల సాయం
- నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి

ప్రజా వాయిస్, నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ఒకవైపు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ, మరోవైపు ఆపదలో ఉన్న బాధితులకు అండగా నిలుస్తున్నారు. శనివారం మాడుగులపల్లి మండలం నారాయణపురం గ్రామంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మహిళా స్వయం సహాయక సంఘాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.అదేవిధంగా తిరుమలగిరి సాగర్ మండలం రంగుండ్ల గ్రామానికి చెందిన ఆంగోతు సునీత ఇటీవల కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో బోల్తాపడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆమె నల్గొండ పట్టణంలోని ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి సునీతను, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పైలెట్ పై ఫేక్ నోటీసుల కలకలం!

- తాండూరు డీఎస్పీకి బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు
- వ్యక్తిగత దూషణలు, నకిలీ పత్రాల ప్రచారాన్ని సహించేది లేదు
- సోషల్ మీడియా ఖాతాల వెనుక ఉన్నవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజా వాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ నోటీసులు జారీ చేసిందంటూ నకిలీ పత్రాన్ని సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ నోటీసును వైరల్ చేస్తున్నారంటూ శనివారం తాండూరు డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పైలెట్ రోహిత్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హెచ్చరించారు. రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత దూషణలకు దిగడం, నకిలీ పత్రాలను సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించడం సహించేది లేదన్నారు.సోషల్ మీడియాలో వివిధ రాజకీయ పార్టీల పేర్లతో పాటు 'తాండూర్ గుసగుస' పేరుతో వాట్సాప్ గ్రూపులు, ఛానెళ్లు ఏర్పాటు చేసి బీఆర్ఎస్ పార్టీతో పాటు పైలెట్ రోహిత్ రెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. తాండూరుతో సంబంధం లేని వ్యక్తులను సైతం గ్రూపుల్లో చేర్చి, నకిలీ వివరాలతో కూడిన సిమ్ కార్డులు వినియోగిస్తూ ఉద్దేశపూర్వకంగా తప్పుడు పోస్టులు పెడుతున్నారని పేర్కొన్నారు.ప్రొఫైల్ ఫొటోలు లేకుండా, కృత్రిమ మేధస్సుతో రూపొందించిన చిత్రాలను ఉపయోగిస్తూ అసత్య ప్రచారానికి పాల్పడుతున్న ఖాతాల వెనుక ఎవరున్నారో పోలీసులు గుర్తించాలని కోరారు. రాజకీయంగా విమర్శలు చేయడం వేరు.. నకిలీ పత్రాలు సృష్టించి వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయడం వేరని స్పష్టం చేశారు.సోషల్ మీడియా ద్వారా తాండూరులో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసి, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరించారు. ఇలాంటి ప్రచారాల వల్ల కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు వస్తుందనే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గమనించాలని సూచించారు.తాండూరు డీఎస్పీ ఈ వ్యవహారంపై వెంటనే విచారణ చేపట్టి, నకిలీ నోటీసు ప్రచారం, అభ్యంతరకర పోస్టులు, సంబంధిత వాట్సాప్ గ్రూపులు, ఛానెళ్ల నిర్వాహకులను గుర్తించి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. చట్టవిరుద్ధమైన కంటెంట్ ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో అన్ని మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, పలువురు కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాయిస్ ఎఫెక్ట్.. బతుకమ్మ కుంటలో ఏర్పాట్లు..!

- ప్రజా వాయిస్ కథనంతో స్పందించిన జీహెచ్ ఎంసీ అధికారులు
- నీళ్ళు,విద్యుత్ దీపాలు, రంగులతో కుంటకు కొత్త శోభ
- హర్షం వ్యక్తం చేసిన షాపురం టీంకు రెడ్డి



ప్రజావాయిస్// రాజేంద్రనగర్: బతుకమ్మ కుంటలో నీళ్లేవి..? ఏర్పాట్లు ఏవి..?అంటూ ఈ నెల 11 వ తేదీన ప్రజావాయిస్ వెలుగులోకి తీసుకొచ్చిన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. తెలంగాణ ఆడపడుచుల బతుకమ్మ పండుగకు కనీస ఏర్పాట్లు కూడా చేయకపోవడంపై అక్టోబర్ 11 న ప్రచురించిన కథనం అధికారుల్లో కదలిక తీసుకొచ్చింది.రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని హైదర్‌షా కోట్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న బతుకమ్మ కుంటలో నీరు లేకపోవడం, విద్యుత్ దీపాలు,ఇతర సదుపాయాలు కనిపించకపోవడంపై ప్రజా వాయిస్ ప్రశ్నించింది. "తెలంగాణ ఆడపడుచుల బతుకమ్మ పండుగకు ఇదేనా గౌరవం.?"అంటూ టింకు రెడ్డి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజావాయిస్ కథనం అనంతరం స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు కుంటలో నీటిని నింపడంతోపాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.కుంట చుట్టూ రంగులు వేసి పరిసరాలకు కొత్త శోభ తీసుకొచ్చారు. ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకొస్తే అధికారులు స్పందించి ఏర్పాట్లు చేపట్టడంపై స్థానికులతో పాటు టింకు రెడ్డి హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల గొంతుకగా నిలిచి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజావాయిస్ కథనంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా వాయిస్ ఎఫెక్ట్...

పూల పండుగ.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక

- ఆడబిడ్డల ఆత్మీయతకు అద్దం
- ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు రూపం
- పాటల్లో జానపద పరిమళం
- ఆటల్లో ఆత్మీయ అనుబంధం
- బతుకమ్మతో పల్లెల్లో పండుగ శోభ

ప్రజా వాయిస్ | ప్రత్యేక కథనం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ప్రకృతి ఒడిలో వికసించే రంగురంగుల పూలను పేర్చి, గౌరమ్మను పూజిస్తూ ఆడపడుచులు జరుపుకునే ఈ పండుగ రాష్ట్ర ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. పూల సోయగాలు.. జానపద గీతాల సందడి.. మహిళల కోలాటాలు.. ఆత్మీయ పలకరింపులతో బతుకమ్మ పండుగ తెలంగాణ పల్లెలకు కొత్త కళను తీసుకొస్తుంది. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. మహిళల ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తోంది.

పూలతో పేర్చిన ప్రకృతి సౌందర్యం

తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మను అందంగా పేర్చడం ఈ పండుగలో ప్రత్యేక ఆకర్షణ. ప్రకృతిలో సహజంగా లభించే పూలతో బతుకమ్మను అలంకరించడం తెలంగాణ ప్రజలకు ప్రకృతిపై ఉన్న ప్రేమకు నిదర్శనం. పూలను సేకరించడం నుంచి బతుకమ్మను పేర్చడం వరకు మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. ఒక్కో పువ్వును జాగ్రత్తగా పేర్చి అందమైన రూపాన్ని తీసుకొస్తారు. పూల పరిమళాలతో ఇళ్లు, వాకిళ్లు కళకళలాడుతాయి.

తొమ్మిది రోజులు.. సంప్రదాయాల సందడి

ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. ప్రతి రోజుకు ప్రత్యేకత ఉండగా, సంప్రదాయబద్ధంగా నైవేద్యాలు సమర్పించి మహిళలు బతుకమ్మను పూజిస్తారు. సాయంత్రం వేళ గ్రామాలు, పట్టణాల్లో మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతారు. చప్పట్ల లయకు అనుగుణంగా సాగే ఆటపాటలు పండుగకు మరింత శోభను తీసుకొస్తాయి.

ఆడబిడ్డల అనుబంధానికి వేదిక

బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించే వేడుకగా నిలుస్తోంది. వివాహమైన ఆడబిడ్డలు పుట్టింటికి చేరుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పండుగను జరుపుకోవడం ప్రత్యేకత. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. బతుకమ్మ పాటల్లో కుటుంబ అనుబంధాలు, మహిళల భావోద్వేగాలు, పల్లె జీవన విధానం ప్రతిబింబిస్తాయి. తరతరాలుగా వస్తున్న జానపద గీతాలు తెలంగాణ సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే పండుగగా ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకుంది. నేడు రాష్ట్రంలోని పల్లెల నుంచి పట్టణాల వరకు, దేశవిదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల మధ్య కూడా బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తద్వారా తెలంగాణ సంస్కృతిని భావితరాలకు పరిచయం చేస్తూ, ప్రపంచానికి రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నారు.

పత్తి కొనుగోళ్లలో దళారులదే రాజ్యం!

- సీసీఐ కేంద్రం ఏర్పాటు కాకముందే దళారుల హడావుడి
- జీఎస్టీ చెల్లించకుండానే పత్తి కొనుగోలు వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు
- ఫిర్యాదు చేసిన వారి పేర్లను దళారులకు వెల్లడించిన మార్కెట్ కమిటీ కార్యదర్శి?
- ఫిర్యాదు చేస్తే నోటీసులతోనే సరిపెడతామంటున్న మార్కెట్ కార్యదర్శి

ప్రజా వాయిస్ సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో పత్తి కొనుగోళ్ల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. రైతులకు అండగా నిలవాల్సిన వ్యవస్థలో దళారులదే ఆధిపత్యం కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాకముందే దళారులు రంగంలోకి దిగి కొనుగోళ్ల వ్యాపారం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రైతులు పత్తి విక్రయాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

జీఎస్టీ లేకుండానే కొనుగోళ్లా?

పుల్కల్ మండల కేంద్రంలో కొందరు దళారులు జీఎస్టీ చెల్లించకుండానే పత్తి కొనుగోలు వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత వాణిజ్య, మార్కెటింగ్ శాఖల అధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. పత్తి కొనుగోళ్లలో నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అన్నది అధికారులు తేల్చాల్సి ఉంది.

ఫిర్యాదు చేసిన వారి పేర్లు దళారులకు చెప్పారా?

పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న వ్యవహారాలపై అధికారులకు ఫిర్యాదు చేసిన వారి పేర్లను మార్కెట్ కమిటీ కార్యదర్శి దళారులకు వెల్లడించారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారికి అండగా నిలవాల్సింది పోయి, ఫిర్యాదు చేసిన వారి వివరాలు బయటకు వెళ్లాయనే ఆరోపణలు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నోటీసులతోనే సరిపెడతారా?

పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై ఫిర్యాదు చేస్తే నోటీసులు జారీ చేయడంతోనే సరిపెడతామంటూ మార్కెట్ కమిటీ కార్యదర్శి వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నోటీసులకే పరిమితమైతే రైతులకు న్యాయం ఎలా జరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సీసీఐ కేంద్రం ఏర్పాటుపై రైతుల ఎదురుచూపులు

పత్తి కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని అరికట్టి రైతులకు న్యాయం చేయాలంటే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం అందుబాటులోకి వస్తే నిబంధనల ప్రకారం పత్తి విక్రయించుకునే అవకాశం ఉంటుందని ఆశిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పుల్కల్ మండల కేంద్రంలో పత్తి కొనుగోళ్ల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని, జీఎస్టీ నిబంధనల ఉల్లంఘనపై పరిశీలన జరపాలని, రైతుల ఫిర్యాదులపై పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవాలను వెలికితీసి రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- మహిళల సాంస్కృతిక వైభవానికి ప్రతీక బతుకమ్మ
- ఎస్పీ శరత్ చంద్ర పవార్

ప్రజా వాయిస్, నల్లగొండ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్, ఆయన సతీమణి పూజా పవార్, మహిళా పోలీస్ సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు, ఇతర అధికారులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళల ఐక్యతను చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యత, ఆత్మీయత, సోదరభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ పలు సందర్భాల్లో పండుగలకు, కుటుంబ వేడుకలకు దూరంగా ఉండాల్సి వస్తుందని తెలిపారు. పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యుల సహకారం, త్యాగాలు ఎంతో విలువైనవని అన్నారు. ఇలాంటి వేడుకలు పోలీసు కుటుంబాల మధ్య ఆత్మీయతను, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, మహిళా ఎస్ఐలు శ్రావణి, అమీన్, మమత, సీఐ నాగరాజు, ఆర్ఐలు సంతోష్, సూరపు నాయుడు, కళ్యాణ్ రాజ్, మహిళా పోలీస్ సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెళ్లైన 45 రోజులకే భర్త హత్యకు భార్య కుట్ర

- ప్రియుడు, అతని స్నేహితుడితో కలిసి ఘాతుకానికి యత్నం
- నిద్రిస్తున్న భర్త ముఖంపై స్ప్రే
- బెల్టుతో గొంతు బిగించి హత్యాయత్నం
- కుటుంబ సభ్యుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం
- ముగ్గురు అరెస్ట్

ప్రజా వాయిస్, వనపర్తి:పెళ్లైన 45 రోజులకే కట్టుకున్న భర్తను హతమార్చేందుకు భార్య కుట్ర పన్నిన ఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. తన ప్రియుడు, అతని స్నేహితుడితో కలిసి భర్తను హత్య చేసేందుకు ప్రయత్నించింది. పథకం ప్రకారం అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న భర్త ముఖంపై స్ప్రే చల్లి, బెల్టుతో గొంతు బిగించి హత్య చేసేందుకు యత్నించారు. బాధితుడు గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమై బయటకు రావడంతో నిందితుల ప్రయత్నం విఫలమైంది.వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి వీధికి చెందిన షబ్బీర్‌కు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లికి చెందిన షాహిదా బేగంతో 45 రోజుల క్రితం వివాహమైంది. అయితే షాహిదాకు హైదరాబాద్‌కు చెందిన తన సమీప బంధువు షాకీర్‌తో కొన్నేళ్లుగా ప్రేమ సంబంధం ఉన్నట్లు సమాచారం. తల్లిదండ్రుల ఒత్తిడితో షాకీర్‌ను కాదని షబ్బీర్‌ను వివాహం చేసుకున్నప్పటికీ, ప్రియుడిని మర్చిపోలేక భర్తను హతమార్చేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ క్రమంలో షాహిదా తన ప్రియుడు షాకీర్, అతని స్నేహితుడు మహేశ్వర్‌లాల్‌తో కలిసి భర్త షబ్బీర్‌ను హత్య చేసేందుకు పథకం రచించింది. ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ముగ్గురూ కలిసి షబ్బీర్ ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. నిద్రిస్తున్న షబ్బీర్ ముఖంపై స్ప్రే చల్లగా, భార్య అతడి చేతులను పట్టుకుంది. మరోవైపు షాకీర్ బెల్టుతో గొంతు బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. అయితే షబ్బీర్ నిందితులను తీవ్రంగా ప్రతిఘటిస్తూ గట్టిగా కేకలు వేయడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.షబ్బీర్ అరుపులు విన్న అతడి సోదరుడు, కుటుంబ సభ్యులు అప్రమత్తమై బయటకు రావడంతో నిందితుల ప్రయత్నానికి ఆటంకం ఏర్పడింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న షబ్బీర్ వారి నుంచి తప్పించుకుని బయటకు వచ్చాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి విచారణ చేపట్టారు. షాహిదా, షాకీర్‌లకు సహకరించేందుకు మహేశ్వర్‌లాల్ ఇంటి బయట పల్సర్ బైక్‌పై వేచి ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు భర్త హత్యకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న షాహిదా, షాకీర్, మహేశ్వర్‌లాల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పెళ్లైన కొద్ది రోజులకే చోటుచేసుకున్న ఈ హత్యాయత్నం ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కుటుంబ సభ్యుల అప్రమత్తత, బాధితుడి ధైర్యంతో ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్‌లో అక్రమ లేఅవుట్ల రగడ

- సర్వే నంబరు 1490 రిజిస్ట్రేషన్లపై విపక్షాల నిప్పులు
- కమిషనర్, ఛైర్ పర్సన్ లకు బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి
- సబ్ రిజిస్ట్రార్, అధికారుల తీరుపై కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీనారాయణ ధ్వజం

ప్రజా వాయిస్, కోరుట్ల కోరుట్ల పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం తీవ్ర దుమారం రేపింది. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న సర్వే నంబరు 1490 మరియు దాని సబ్ డివిజన్లలో అనధికార లేఅవుట్లు, ఎఫ్‌టీఎల్ (పూర్తి చెరువు నీటి మట్టం) పరిధిలోని ప్లాట్లు, అక్రమ రిజిస్ట్రేషన్లు, తద్వారా మున్సిపల్ ఆదాయానికి జరుగుతున్న గండిపై 11వ వార్డు కౌన్సిలర్, బీజేపీ పట్టణాధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విపక్ష కౌన్సిలర్ల నేతృత్వంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కౌన్సిలర్లు ఏకమై మున్సిపల్ కమిషనర్, ఛైర్‌పర్సన్‌లకు సంయుక్తంగా వినతిపత్రాన్ని అందజేశారు. సామాన్య ప్రజల సొమ్మును కాపాడాలని, అనుమతులు లేని అక్రమ లేఅవుట్ వ్యాపారాన్ని తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు.

కోరుట్ల పట్టణ సర్వే నంబరు 1490 మరియు దాని సబ్ డివిజన్లలో అధికారుల ఉత్తర్వులను బహిరంగంగా ఉల్లంఘిస్తూ రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయని కౌన్సిలర్లు ఆధారాలను బయటపెట్టారు. ఈ భూమి అనధికారిక లేఅవుట్ అని, ఇక్కడ ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని మున్సిపల్ కమిషనర్ గతంలోనే ఉత్తర్వుల సంఖ్య జి1/1212/2026 ద్వారా సబ్ రిజిస్ట్రార్‌కు స్పష్టమైన నిషేధ ఉత్తర్వులు ఇచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ మున్సిపల్ చట్టం-2019, డీటీసీపీ (పట్టణ ప్రణాళికా విభాగం) నిబంధనల ప్రకారమే లేఅవుట్ ప్రక్రియ జరగాలని కోరుట్ల ఆర్డీవో (రెవెన్యూ డివిజనల్ అధికారి) కూడా ఆదేశించారన్నారు. కమిషనర్ స్పష్టమైన నిషేధ ఉత్తర్వులు ఉన్నప్పటికీ, సబ్ రిజిస్ట్రార్ నిబంధనలు ఉల్లంఘిస్తూ 260 చదరపు గజాల ప్లాట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడంపై కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొంటే భవిష్యత్తులో గృహ నిర్మాణ అనుమతులు రాక కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడతారని, ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం) కోసం అదనపు ఆర్థిక భారం పడుతుందని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన మౌలిక సదుపాయాలలో 10 శాతం ఓపెన్ స్పేస్ (ఖాళీ స్థలం), డ్రైనేజీ (మురుగునీటి కాలువలు), రోడ్లు, విద్యుత్ దీపాల వసతులను తనిఖీ చేయాలని, లేనిపక్షంలో 14 శాతం ప్రో-రేటా చార్జీలు వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఈ అక్రమాల వల్ల మున్సిపాలిటీకి లక్షలాది రూపాయల ఆదాయ నష్టం వాటిల్లుతోందని, తక్షణమే బకాయిలు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వే నంబరు 1490 భూమి చెరువు కాలువ ఎఫ్‌టీఎల్ / బఫర్ జోన్ (రక్షిత ప్రాంతం) పరిధిలోకి వస్తుందని కౌన్సిలర్లు హెచ్చరించారు. వర్షాకాలంలో ఈ కాలువ ప్రవాహం వల్ల ఇప్పటికే 9, 10, 11 వార్డుల ప్రజల ఇళ్లలోకి వరద నీరు చేరి తీవ్ర నష్టం జరుగుతోందని గుర్తుచేశారు. లాభాల కోసం కాలువపై తక్కువ నాణ్యతతో ప్రమాదకరమైన స్లాబ్ నిర్మించి, కొనుగోలుదారులను తప్పుదోవ పట్టిస్తూ ప్లాట్లు అమ్ముతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ప్రభుత్వ జీవోలు 131, 135 ప్రకారం వసూలు చేయాల్సిన లేఅవుట్ అభివృద్ధి రుసుములు, బెటర్మెంట్ చార్జీల పట్టికను అధికారికంగా విడుదల చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై, వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని 11వ వార్డు కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీనారాయణతో పాటు బీజేపీ కౌన్సిలర్లు ఇందూరి తిరుమలవాసు, గూగులోత్ శ్రీకాంత్ అలాగే ఇతర కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ను గట్టిగా డిమాండ్ చేశారు.

ఒక పక్క డ్యామేజ్....మరొక్క లీకేజ్

- బండ్లగూడ జాగిర్ లో తాగునీటి కష్టాలు
- వృథాగా పారుతున్న మంచినీరు
- హిమగిరి నగర్ లో లీకేజీ
- సూర్యోదయ కాలనీలో 15 రోజులుగా నీటి సరఫరా బంద్
- జలమండలి,జీహెచ్ ఎంసీ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

ప్రజావాయిస్//రాజేంద్రనగర్: సర్కిల్ పరిధిలో తాగునీటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. హైదర్‌షాకోట్ డివిజన్ హిమగిరి నగర్‌లో పైపులైన్ లీకేజీతో మంచినీరు రోడ్లపై వృథాగా పారుతుండగా, బండ్లగూడ డివిజన్ సూర్యోదయ కాలనీలో 15 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది.హిమగిరి నగర్‌లో నెలల తరబడి సక్రమంగా నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే,లీకేజీ మరమ్మతుల్లో జలమండలి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.మరోవైపు, సూర్యోదయ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులతో మంచినీటి పైపులు దెబ్బతినడంతో రోడ్డు నంబర్లు 1,3తో పాటు పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికవాసులు వాపోతున్నారు.సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించడం లేదని,శాఖల మధ్య సమన్వయ లోపానికి ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తోందని మండిపడుతున్నారు.ఒకచోట నీటి వృథా.. మరోచోట నీటి కోసం తిప్పలు,ఉన్నతాధికారులు వెంటనే స్పందించి హిమగిరి నగర్‌లో లీకేజీని అరికట్టి, సూర్యోదయ కాలనీలో పైపులకు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అమ్మవారి కరుణాకటాక్షాలతో కరువు కాటకాలు తొలగిపోవాలి

సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రైతుల ఇళ్లలో ఆనందం వెల్లివిరియాలి

ఇంచర్లలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

నిర్వహించిన అచ్చునూరి కిషన్ దంపతులు

అచ్చునూరి కిషన్ ముదిరాజ్

ప్రజా వాయిస్ జిల్లా బ్యూరో చీఫ్

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో అచ్చునూరి కిషన్ దంపతులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, భక్తిపారవశ్యం మధ్య అమ్మవారిని దర్శించుకొని గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అచ్చునూరి

కిషన్ మాట్లాడుతూ, అమ్మవారి కరుణాకటాక్షాలతో ఎల్‌నినో ప్రభావం, కరువు కాటకాలు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. పాడిపంటలు సమృద్ధిగా పండి రైతుల జీవితాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని, రైతుల ఇళ్లలో ఆనందం నిండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని జగజ్జననిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజల కష్టాలు తొలగి, రైతాంగం సుభిక్షంగా ఉండి, గ్రామమంతా ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముస్నిపెల్లి కుమార్ గౌడ్, సోనవేణి కుమార్, శానవేని సురేష్, చింతల రవీందర్, సోమల్ల అనిల్, బేతెల్లి అవినాష్, పూజారి శ్రీనివాస్, మాదాసు శ్రీనివాస్, పెద్ది అశోక్, దేవునూరి నాగరాజు, అచ్చునూరి వంశీ, దేశిని రమేష్, భాస్కర్, సదానందం,కుమార్, జలేందర్, మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్ల తర్వాత ఒక్కటైన మిత్రబృందం

గోదావరిఖని శ్రీ వాణి నికేతన్ హైస్కూల్ 2005-06 విద్యార్థుల అపూర్వ ఆత్మీయ కలయిక

ప్రజా వాయిస్ గోదావరిఖని

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రాంతంలో ఒక అరుదైన, మధురమైన జ్ఞాపకాల వేడుక ఆవిష్కృతమైంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని శ్రీ వాణి నికేతన్ హైస్కూల్‌లో 2005–2006 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు శనివారం ఘనంగా గెట్ టుగెదర్ ప్రోగ్రామ్‌ను నిర్వహించుకున్నారు. ప్రధాన రోడ్డులోగల ఆయాంశ్ బ్యాంక్వెట్ హాల్ వేదికగా ఈ అద్భుత వేడుక అత్యంత వైభవంగా జరిగింది.పాఠశాల రోజులను ముగించుకుని జీవితంలో విభిన్న రంగాల్లో స్థిరపడిన మిత్రులు, దాదాపు ఇరవై సంవత్సరాల (20 ఏళ్ల) తర్వాత మళ్లీ ఒకచోట కలుసుకోవడం విశేషం. ఈ అపూర్వ కలయికతో అందరి మొఖాల్లోనూ బాల్యపు జ్ఞాపకాలు,

చదువుకున్ననాటి మధుర క్షణాలు తిరిగి ప్రాణం పోసుకున్నట్లుగా ఆనందం వెల్లివిరిసింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మిత్రులందరూ తమ పాత పాఠశాల రోజులను, క్లాస్‌రూమ్ కబుర్లను, ఆటపాటలను ఒకరికొకరు సరదాగా పంచుకున్నారు. రెండు దశాబ్దాల తర్వాత ఎదురుపడిన స్నేహితులను చూసి ఆలింగనం చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుంటూ ఈ వేడుకను జీవితంలో ఎప్పటికీ మరువలేని జ్ఞాపకంగా మల్చుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. గురువులకు పాదాభివందనం చేసి శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి తమ కృతజ్ఞతా భావాన్ని చాటుకున్నారు. తమను ఈ స్థాయికి తీర్చిదిద్దిన గురువులను ఇరవై ఏళ్ల తర్వాత సత్కరించుకోవడం ఎంతో భావోద్వేగంగా ఉందని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. ఎన్ని సంవత్సరాలు గడిచినా, ఎంత దూరంలో ఉన్నా పాఠశాల రోజుల్లో ఏర్పడిన స్నేహం మరియు గురువుల ఆశీస్సులు ఎప్పటికీ చెరిగిపోవని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సమ్మేళనాలను తరచుగా నిర్వహించుకోవాలని తీర్మానించుకున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజా వాయిస్ , లక్షేటి పేట

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల సంఖ్య, వ్యాధుల వివరాలు, మందుల లభ్యత, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించి ఆసుపత్రికి ప్రతిరోజూ వస్తున్న రోగులు, నమోదు అవుతున్న వ్యాధులు, చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దగ్గు, జలుబు, జ్వరాలతో పాటు డెంగ్యూ లక్షణాలతో వస్తున్న రోగుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అవసరమైన మందులు సరిపడా అందుబాటులో ఉంచాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని ల్యాబ్‌ను సందర్శించి పరీక్షల నిర్వహణ, రోగుల వివరాల నమోదు, రిజిస్టర్ల నిర్వహణ అంశాలను పరిశీలించి,

ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలను క్రమబద్ధంగా నమోదు చేయాలని, వ్యాధులపై సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఆహార నాణ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. డెంగ్యూ లక్షణాలతో ఆసుపత్రికి వస్తున్న రోగులు ఏ ప్రాంతాలకు చెందినవారో గుర్తించి, ఆయా ప్రాంతాలలో త్రాగునీటి నాణ్యతను పరీక్షించడంతో పాటు వ్యాధుల వ్యాప్తికి దారితీసే పరిస్థితులను గుర్తించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో త్రాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యలు ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో వెంటనే నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న త్రాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు 10వ వార్డుతో పాటు పట్టణంలోని అన్ని వార్డులలోనూ నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. డెంగ్యూ కేసులు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, వివరాలను సమగ్రంగా పరిశీలించాలని వైద్యులకు సూచించారు. మున్సిపల్ అధికారులు అన్ని వార్డులలో త్రాగునీటి పరీక్షలు నిర్వహించడంతో పాటు మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల వృద్ధికి అనుకూలమైన పరిస్థితులను నివారిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడం, అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టడం, ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు అన్నదానం

నిర్వహించిన బీరంగూడ డివిజన్ అధ్యక్షులు ఈర్ల రాజు

పటాన్ చెరువు ప్రజావాయిస్

భక్తి మనకు ఆధ్యాత్మిక బలాన్ని ఇస్తోందని సేవ సమాజంలో ఐక్యతను పెంచుతుందని కామెంట్ డివిజన్ బిజెపి అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ అన్నారు.పటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్పూర్ మండలం పరిధిలోని అమీన్పూర్, బీరంగూడ డివిజన్లలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

పలు ప్రాంతాల్లో పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న ఈర్ల రాజు ముదిరాజ్

కిష్టారెడ్డిపేట్ గ్రామంలో దొంతు పెంటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దుర్గా నగర్ కాలనీలో సముద్రాల రాకేష్, వారి మిత్రుల ఆధ్వర్యంలోలి నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో మమేకమయ్యారు.పటేల్‌గూడ గ్రామంలోని సూర్యోదయ కాలనీలో రఘు, వారి మిత్రుల ఆధ్వర్యంలోలి నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.పటేల్‌గూడలో రొయ్యల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలోలి నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా పటేల్‌గూడ గ్రామం హరివిల్లు కాలనీలో కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోలి నిర్వహించిన దుర్గామాత పూజలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ఉత్సవ నిర్వాహకులు, భక్తులు ఆయనకు స్వాగతం పలికారు.

సనాతన ధర్మ పరిరక్షణ మనందరి బాధ్యత

ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలు మాత్రమే కాకుండా, హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి భావం, సామాజిక ఐక్యతను చాటిచెప్పే పవిత్రమైన పండుగలని అన్నారు.మన సంస్కృతిని మనమే కాపాడుకోవాలి.. మన సంప్రదాయాలను భావితరాలకు అందించాలి.. ధర్మాన్ని ఆచరిస్తూ, సేవాభావంతో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు.దుర్గామాత ఆరాధన స్త్రీశక్తికి, ధర్మానికి, ధైర్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సవాలు యువతలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు.అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని చాటిచెబుతాయని, భక్తితో పాటు సేవా దృక్పథం కూడా ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. పండుగలు కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ కలిపే వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు.అమ్మవారి కృపతో అమీన్పూర్ మండలంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర గౌరవంతో పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో బీజేపీ ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీధర్ రెడ్డి బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల రాకేష్ గుప్తా, ఈర్ల భాస్కర్ ముదిరాజ్, రొయ్యల రాజు ముదిరాజ్, కమ్మరి భాస్కర్ చారి, భైరవ్, నాగరాజ్, శ్రీనివాస్, కల్వకుంట్ల రాకేష్ గుప్తా, విష్ణువర్ధన్ రెడ్డి, మహేష్, దేవేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.వీరితో పాటు పెద్ద సంఖ్యలో భవానీ మాలధారులు, బీజేపీ కార్యకర్తలు, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

మంథని గాంధీచౌక్ దుర్గాదేవి మండపంలో ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

ప్రత్యేక పూజలు నిర్వహించిన హైకోర్టు న్యాయవాది బుద్ధార్తి నవీన్ పటేల్ దంపతులు

ప్రజా వాయిస్ వాయిస్

మంథని గాంధీచౌక్ వద్ద కొలువుదీరిన దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. భజరంగ్ యూత్ మంథని ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా, శనివారం అమ్మవారు మహాగౌరి దేవి రూపంలో భక్తులకు దివ్యదర్శనమిస్తూ విశేష పూజలందుకున్నారు. ?ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని, హైకోర్టు ప్రముఖ న్యాయవాది మరియు జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బుద్ధార్తి నవీన్ పటేల్ దంపతులు గాంధీచౌక్ అమ్మవారి మండపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి వేడుకల్లో ఘనంగా పాల్గొన్నారు. ?మంథని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో మరియు ఎలాంటి విఘ్నాలు లేకుండా సుఖశాంతులతో వర్ధిల్లాలని వారు అమ్మవారిని మనసారా ప్రార్థించారు. ?జనతా ఫౌండేషన్ ద్వారా నిత్యం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, సమాజంలోని పేదలకు, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న బుద్ధార్తి నవీన్ పటేల్ దంపతులు... భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొనడం పట్ల స్థానిక యువకులు, భక్తులు మరియు శ్రేయోభిలాసులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఉద్యాన వర్సిటీలో ఉద్యోగుల పదోన్నతులకు పెద్దపీట

డిప్యూటీ కంప్ట్రోలర్‌గా చెంచు రామయ్యకు పదోన్నతి

ఘనంగా సన్మానించిన నాన్ టీచింగ్ సిబ్బంది

ప్రజావాయిస్//రాజేంద్రనగర్:

ఉద్యోగుల సేవలకు గుర్తింపు, పదోన్నతులతో ప్రోత్సాహం లభిస్తే సంస్థ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు యాదయ్య అన్నారు.శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డిప్యూటీ కంప్ట్రోలర్‌గా పదోన్నతి పొందిన ఏ. చెంచు రామయ్యను ఆయన నివాసంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.అనంతరం పోతురాజు యాదయ్య మాట్లాడుతూ.. వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బోధనేతర ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడం,అవసరమైన సౌకర్యాలు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు.ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ విషయంలో సహకరిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ ఏ.భగవాన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఉద్యోగులకు అందే గుర్తింపు,ప్రోత్సాహం కేవలం వారి వ్యక్తిగత పురోగతికే కాకుండా విశ్వవిద్యాలయ అభివృద్ధికి,రైతులకు మెరుగైన సేవలు అందించడానికి కూడా దోహదపడతాయని యాదయ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు వెంకటస్వామి,ముఖేష్, శ్రావణ్,జూనియర్ అసిస్టెంట్లు పేరిరెడ్డి,చంటి, హరికృష్ణ,తదితరులు పాల్గొని చెంచు రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ కలిసి శుభాకాంక్షలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..

ప్రజా వాయిస్,వరంగల్ చెన్నారావుపేట :

వరంగల్ జిల్లా జడ్జి శ్రీమతి బి.వి. నిర్మలా గీతంబ గారిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు..

ప్రతి గ్రామంలో 20 ఇంకుడు గుంతలకు ఎస్టిమేట్లు సిద్ధం చేయాలి

ప్రజా వాయిస్ సొనాల.ఆదిలాబాద్

జిల్లాలో ఇంకుడు గుంతల నిర్మాణం, అంచనా వ్యయాల (ఎస్టిమేట్ల) తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి అధికారులు ఆదేశించారు. ఈ పనుల్లో జిల్లా వెనుకబడి ఉన్న నేపథ్యంలో, ప్రతి గ్రామంలో కనీసం 20 ఇంకుడు గుంతలకు ఎస్టిమేట్లు సిద్ధం చేసి, వాటికి పరిపాలనా అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వి.బి.జి. రామ్‌జీ కార్యక్రమానికి సంబంధించిన సిబ్బంది ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో పురోగతి పెంచేందుకు గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోనాల ఎంపీడీవో ప్రతాప్‌రావుతో పాటు సంబంధిత సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి తహసిల్దార్ కార్యాలయ ఇన్చార్జిగా ఐఏఎస్ రోహిత్ నేత బాధ్యతల స్వీకరణ..

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి

ఐఏఎస్ శిక్షణలో భాగంగా నాలుగు వారాలపాటు ఎల్కతుర్తి మండల తహసిల్దార్ ఎమ్మార్వో కార్యాలయ ఇన్చార్జిగా ఐఏఎస్ అధికారి రోహిత్ నేత బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లె పోగు రమేష్ బాబు, శనిగరపు వెంకటేష్, కందుకూరి మహేశ్వర చారి, ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ నాలుగు వారాల శిక్షణ కాలములో మండల పరిపాలన ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఆయన క్షేత్రస్థాయి అనుభవాన్ని పొందనున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఐఏఎస్ అధికారి రోహిత్ నేతకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- **ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు**
- **తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు**

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ఆహర్నిశలు కృషి చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని ధర్మారంలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీపీఎస్ పాఠశాల చుట్టూ డీఎంఎఫ్టి నిధులతో ప్రహరీ గోడ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నూతనంగా నిర్మిస్తున్న పాఠశాలలో విద్యార్థుల కోసం అత్యాధునిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు తిరుపతి జ్యోతి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, సర్పంచ్ మేకల మేరీఆనంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ విద్యాసాగర్, కాంగ్రెస్ నాయకులు తుమ్మల వినోద్ రెడ్డి, పూలపెల్లి సోమిరెడ్డి, బొమ్మగాని లక్ష్మయ్య, కంబాల భద్రయ్య ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోగుల దాహార్తి తీర్చేందుకు వాటర్ కూలర్ అందజేత

సొంత ఖర్చులతో రూ.10 వేల విలువైన వాటర్ కూలర్ అందించిన బీజేపీ కన్నెపల్లి మండల అధ్యక్షుడు మైదం ఆశన్న

ప్రజా వాయిస్ కన్నెపల్లి/బెల్లంపల్లి

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం కన్నెపల్లి మండలంలోని ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులు, విధులు నిర్వహించే వైద్య సిబ్బంది తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన బీజేపీ కన్నెపల్లి మండల అధ్యక్షుడు మైదం ఆశన్న తన ఔదార్యాన్ని చాటుకున్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తన సొంత ఖర్చులతో రూ.10 వేల విలువైన వాటర్ కూలర్‌ను ఉచితంగా అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం వివిధ గ్రామాల నుంచి రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ఆసుపత్రిలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో రోగులు, వారి వెంట వచ్చే కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన మైదం ఆశన్న స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వాటర్ కూలర్‌ను అందించడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ వాటర్ కూలర్‌ను బీజేపీ రాష్ట్ర నాయకుడు, బెల్లంపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి కొయ్యల ఏమాజి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటర్, కూలర్ అందించడం అభినందనీయమన్నారు. సేవా దృక్పథంతో ప్రజల అవసరాలను గుర్తించి, తన సొంత నిధులతో సహాయం చేసిన మైదం ఆశన్నను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు అవసరమైన సమయంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ప్రయోజనకరమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ అనిల్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు బొల్లెడ్ల కేశవరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రామయ్య యాదవ్, గోవర్ధన్, జిల్లా కార్యదర్శి ఆకుల శంకర్, యుగంధర్, సురేష్, మల్లేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

కోర్టుల పునరుద్ధరణ, క్రీడా సామగ్రి, ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే నాగరాజు హామీ

టెన్నిస్‌కు ప్రోత్సాహం అందిస్తాం : సీపీ శ్వేత

అండర్-17 బాలబాలికల విభాగాల్లో రంగారెడ్డి జిల్లా జట్లకు ఛాంపియన్‌షిప్‌లు

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

హనుమకొండ జిల్లాలో టెన్నిస్ క్రీడాభివృద్ధికి అవసరమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య టెన్నిస్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా, వరంగల్ పోలీస్ కమిషనర్ కే. శ్వేత ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. హనుమకొండలోని జేఎన్ఎస్ లో టెన్నిస్ క్రీడ అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన టెన్నిస్ సామగ్రి అందించడం, కోర్టులను పునరుద్ధరించడం, రాత్రి వేళల్లోనూ సాధన చేసేందుకు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయడం వంటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు మెరుగైన వసతులు అవసరమని, ప్రతిభావంతులకు తగిన ప్రోత్సాహం అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధిస్తారని పేర్కొన్నారు.

టెన్నిస్ అభివృద్ధికి ప్రోత్సహిస్తా : సీపీ శ్వేత

ప్రత్యేక అతిథి వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ.. టెన్నిస్‌ను అన్ని వర్గాల విద్యార్థులకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు ఈ క్రీడలో శిక్షణ పొందే అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అవసరమైన శిక్షణ, క్రీడా సామగ్రి, సాధన వసతులు అందుబాటులో ఉంటే పేద, గ్రామీణ విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. అనంతరం అండర్-17, అండర్-19 బాలబాలికల విభాగాల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అండర్ 19, అండర్ 17 పాఠశాలల క్రీడా కార్యదర్శులు శ్రీధర్, వాసుదేవరావు, హనుమకొండ యువజన క్రీడా అధికారి కొత్త ప్రశాంత్, హనుమకొండ డిస్ట్రిక్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పింగిలి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎర్రగట్టు స్వామి, ప్యాట్రన్ రవిచంద్ర, కోశాధికారి సిరికొండ సంజీవరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఆఫీసర్ క్లబ్ జాయింట్ సెక్రెటరీ కన్నా రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బరుపాటు గోపి, అబ్బర్వర్లు శ్రీనివాస్, రాజమల్లు, అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జట్ల ఛాంపియన్‌షిప్ ఫలితాలు ఇలా ఉన్నాయి.

అండర్-17 బాలుర జట్ల ఛాంపియన్‌షిప్: రంగారెడ్డి జిల్లా

అండర్-17 బాలికల జట్ల ఛాంపియన్‌షిప్: రంగారెడ్డి జిల్లా

అండర్-19 బాలుర జట్ల ఛాంపియన్‌షిప్: హైదరాబాద్ జిల్లా

అండర్-19 బాలికల జట్ల ఛాంపియన్‌షిప్: రంగారెడ్డి జిల్లా

వ్యక్తిగత విభాగాల్లో తొలి ఐదు స్థానాలు

అండర్-17 బాలికలు:
ఇమాని మోక్ష సాయి - రంగారెడ్డి
బొమ్మారెడ్డి జానకి రెడ్డి - రంగారెడ్డి
సురబోయిన వాగ్దేవి - హైదరాబాద్
అరూబా ఇమామ్ - హైదరాబాద్
గోవింద్ ఆల్య - రంగారెడ్డి

అండర్-17 బాలురు:
వంజి ఆర్యన్ - రంగారెడ్డి
అద్విత్ - హైదరాబాద్
రుద్రాన్ష్ శ్రీవాస్తవ్ - రంగారెడ్డి
అక్షజ్ పద్మ - రంగారెడ్డి
డి. ఆదిత్య - రంగారెడ్డి

అండర్-19 బాలికలు:
బి. భావిష్య క్రాంతి - రంగారెడ్డి
డి. అర్ణవి - హైదరాబాద్
ఎస్. శ్రీ తన్య - రంగారెడ్డి
వి. సాయి నేత్ర - హైదరాబాద్
పి. శ్రీనిత్ సాయి - హైదరాబాద్

అండర్-19 బాలురు:
జె. సిద్ధార్థ్ - హైదరాబాద్
కె. చంద్ర సిద్ధార్థ్ - హైదరాబాద్
కె.యు. అభిరామ్ - రంగారెడ్డి
పి. నిఖిలేష్ - హైదరాబాద్
పి. కార్తీక్ సుహాస్ బాబు - రంగారెడ్డి

ఒంటరిదానివికాదు..నీకుఅన్నగానేనున్నా..అంటూ ఆప్యాయంగా భరోసా

అనాథ బాలికకు అన్నగా అండగా చిలువేరు సమ్మయ్య గౌడ్ భరోసా!

నాయనమ్మను కోల్పోయిన బొడ్డుల అఖిలకు అండగా నిలిచి.. చదువు, భవిష్యత్తుకు భరోసా

కుటుంబానికి ఒక క్వింటాల్ బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేత

ధనముంటే సరిపోదు..ఆపదలో ఆదుకునే గుణముండాలి

పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రు నాయక్

ప్రజా వాయిస్ కేసముద్రం

కన్నవారికి దూరమై నాయనమ్మే సర్వస్వంగా బతుకుతున్న ఆ బాలికకు ఆ ఆసరా కూడా దూరమైంది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బొడ్డుల అఖిలకు కేసముద్రం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ అండగా నిలిచారు. 'నువ్వు ఒంటరిదానివి కాదు.. నీకు అన్నగా నేనున్నా' అంటూ ఆప్యాయంగా భరోసానిచ్చారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబానికి ఒక క్వింటాల్ బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన బొడ్డుల అఖిల జీవితం చిన్ననాటి నుంచే విషాదాలతో నిండిపోయింది. అఖిల తల్లి,తండ్రి బొడ్డుల శ్రీనివాస్ రెండేళ్ల వయసులోనే దూరమై కన్నవారి ప్రేమను కోల్పోయి అనాథలాగా మిగలాగా అప్పటి నుంచి నాయనమ్మ స్వరాజ్యం ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ అఖిలను అల్లారుముద్దుగా పెంచి పోషించింది. తనకు ఉన్నదంతా మనవరాలి భవిష్యత్తేనని భావించి, ఆమె చదువుకు అండగా నిలిచింది. నాయనమ్మ ప్రోత్సాహంతో చదువులో రాణించిన అఖిల కాట్రపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. ప్రస్తుతం వరంగల్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ విద్యాసంస్థలో ఉన్నత విద్య అభ్యసిస్తోంది. ఇలాంటి సమయంలో నాయనమ్మ స్వరాజ్యం మరణించడంతో అఖిలకు దిక్కెవరనే ప్రశ్న ఎదురైంది. తనను కంటికి రెప్పలా కాపాడిన నాయనమ్మ దూరం కావడంతో ఆ బాలిక కన్నీరుమున్నీరైంది. సర్వస్వం నాయనమ్మే అనుకొని బ్రతుకుతున్న అఖిల చివరకు ఆమెకే తలకొరవి పెట్టాల్సిన కన్నీటి సముద్రం లో పడేసాడు దేవుడు అని గ్రామ ప్రజలు పాప ను చూసి కన్నీటి పర్యంతం అవుతున్నారు దీనితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అఖిలకు అన్నగా అండగా సమ్మయ్య గౌడ్

అఖిల నాయనమ్మ స్వరాజ్యం మరణవార్త ను కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు జల్లే యాకంభ్రం, ప్రభాకర్ ద్వారా తెలుసుకున్న కేసముద్రం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ వెంటనే కాట్రపల్లి గ్రామానికి చేరుకున్నారు. నాయనమ్మను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న అఖిలను పరామర్శించి ధైర్యం చెప్పారు. 'నువ్వు ఒంటరిదానివి కావు.. నీకు ఒక అన్నగా నేను అండగా ఉంటాను. నీ చదువు, భవిష్యత్తు విషయంలో నీకు తోడుగా నిలుస్తాను' అంటూ భరోసానిచ్చారు. అంతేకాకుండా ఆ కుటుంబానికి ఒక క్వింటాల్ బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ సహాయం అందించడంతో పాటు బాలిక భవిష్యత్తుపై భరోసా కల్పించారు. గ్రామ పెద్దలు, కుల సంఘం నాయకులతో కలిసి అంత్యక్రియల నిర్వహణలోనూ భాగస్వామ్యమయ్యారు.

ధనముంటే సరిపోదు.. ఆపదలో ఆదుకునే గుణముండాలి

ఈ సందర్భంగా బిపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రు నాయక్ మాట్లాడుతూ, కేవలం ధనం ఉంటే సరిపోదని, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునే మంచి మనసు ఉండాలని పేర్కొన్నారు. నాయనమ్మను కోల్పోయి అనాథగా మిగిలిన బాలికకు అన్నగా అండగా నిలవడంతో పాటు, ఆమె కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించిన చిలువేరు సమ్మయ్య గౌడ్ సేవాభావాన్ని అభినందించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సర్పంచ్ ఎదురబోయిన సురయ్య,జల్లె యాకాంభ్రం మాట్లాడుతూ..మన కేసముద్రం లోనే కాకుండా మండలం లోని అన్ని గ్రామాల్లో ఏ కాదుభీదవాడి ఇంట్లో విషాదం జరిగినా, ఆపదలో ఉన్నా సమ్మిగౌడ్ దృష్టికి తీసుకెళ్లండి అనే రీతిలో సమ్మిగౌడ్ సేవలు ఉన్నాయని,బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న సమ్మన్న సేవలు మరువలేనివి అన్నారు..అఖిలకు భవిష్యత్తులోనూ తోడ్పాటు అందిస్తామని తెలిపారు. నాయనమ్మను కోల్పోయిన బాలికకు ఆప్యాయతను పంచుతూ, ఆమె కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించిన చిలువేరు సమ్మయ్య గౌడ్ స్పందనపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు..ఈ కార్యక్రమంలో సామల నర్సయ్య ఉపసర్పంచ్ షాగంటి యాదగిరి, సిరికొండ మల్లయ్య, పుట్ట ప్రభాకర్, జాటోత్ లక్ష్మణ్, రుద్ర యాదగిరి, దాసరి శ్రీనివాస్, బేతూ సత్యం, సాంబారి వీరాస్వామి, కర్పూరపు వెంకటేశ్వర్లు, నల్లగొప్పుల సాయిలు, బోదాసు చంద్రయ్య, సిరికొండ వెంకన్న, అడప రవీందర్, ఓర్సు ముత్తయ్య, నాయిని స్వామి, యెడల్లి దేవరాజు,దేవులపల్లి కట్టయ్య,జినుకల శ్రావన్, నూణావత్ మాను, పాలికోజు బీష్మచారి మరియు కాంగ్రెస్ పార్టీ పెద్దలు, పద్మశాలి కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జనానికి ఊరకుంట చెరువు కట్ట మరమ్మతులు

గ్రామస్తుల విజ్ఞప్తికి స్పందించిన సర్పంచ్ సుధమళ్ళ వెంకటి తాత్కాలికంగా సమస్యకు పరిష్కారం..

ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని అకెనపల్లి గ్రామంలో బతుకమ్మ నిమజ్జనానికి వచ్చే మహిళలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా గ్రామంలోని ఊరకుంట చెరువు కట్టపై మరమ్మతులు చేపట్టారు. సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ చెరువు కట్టపై నల్లరేగడి మట్టి ఉండటంతో వర్షాకాలంలో బురదమయంగా మారి, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామ సర్పంచ్ సుదమల్ల వెంకటి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డి. సత్యనారాయణ స్పందించి, మందమర్రి ఏరియా జీఎంతో మాట్లాడి ఓపెన్‌కాస్ట్ గని నుంచి మట్టిని ట్రాక్టర్ల ద్వారా తెప్పించి కట్టపై పోయించి చదును చేయించారు.

రైతులకు తప్పిన కష్టాలు

గతంలో వర్షాకాలంలో చెరువు కట్టపై నడవాలంటే మోకాళ్ల లోతు బురదలో దిగబడుతూ తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేదని గ్రామస్తులు తెలిపారు. వ్యవసాయ పనుల కోసం పొలాల్లోకి ఎరువులు, పురుగుమందుల బస్తాలు తీసుకెళ్లడం కష్టంగా ఉండేదని, ట్రాక్టర్లు బురదలో దిగబడటంతో పాటు ఎడ్లబండ్ల రాకపోకలకు సైతం ఆటంకాలు ఎదురయ్యేవని పేర్కొన్నారు. ప్రస్తుతం ఓపెన్‌కాస్ట్ మట్టిని పోయించి చదును చేయడంతో తాత్కాలికంగానైనా కట్టపై రాకపోకలు సులభతరమయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు.

మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి.

ఈ ఊరకుంట చెరువు ఆయకట్టు కింద సుమారు 40 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, చెరువు అవతలి వైపు దాదాపు 100 ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. దీంతో చెరువు కట్ట రైతులకు ఎంతో కీలకంగా మారింది. ప్రస్తుతం చేపట్టిన మరమ్మతులు తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, భవిష్యత్తులో శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. చెరువు కట్టకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి, సుందరీకరణ పనులు నిర్వహించి, మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తే గ్రామానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. బతుకమ్మ నిమజ్జనానికి వచ్చే మహిళలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు, రైతులకు ఏడాది పొడవునా రాకపోకలు సులభంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సహకరించిన వారికి కృతజ్ఞతలు

గ్రామస్తుల సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన మందమర్రి ఏరియా జీఎం, ఆకెనపల్లి సర్పంచ్ సుదమల్ల వెంకటి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. సత్యనారాయణలకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో చెరువు కట్ట అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి, శాశ్వత పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బుడిమ మల్లేష్, బుడిమ విజయ్, కార్ల మల్లేష్, ఓన్నాల రాజు, ఒగ్గరి కిషన్, కార్ల రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి మండల బీఆర్ఎస్ ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా గాదెపాక కిరణ్

ప్రధాన కార్యదర్శిగా లకావత్ నాగరాజు నాయక్ ఏకగ్రీవ ఎన్నిక

ఉపాధ్యక్షులుగా గొనె మహేందర్, పూజారి సురేష్

గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ఫోరం లక్ష్యం

ప్రజా వాయిస్ । పాలకుర్తి । అక్టోబర్ 17

జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ ఉప సర్పంచ్ ల ఫోరం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పాలకుర్తి మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా గాదెపాక కిరణ్, ప్రధాన కార్యదర్శిగా లకావత్ నాగరాజు నాయక్ ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గొనె మహేందర్, పూజారి సురేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ఉప సర్పంచ్ అందరిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామ పంచాయతీల బలోపేతం కోసం సమన్వయంతో పనిచేయాలనే లక్ష్యంతో ఫోరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ఉప సర్పంచ్ లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, గ్రామాల అభివృద్ధికి అవసరమైన చర్యల కోసం సమష్టిగా కృషి చేయడం, ఉప సర్పంచ్ ల హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించడం వంటి అంశాలకు ఫోరం ప్రాధాన్యత ఇవ్వనుంది. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గాదెపాక కిరణ్, ప్రధాన కార్యదర్శి లకావత్ నాగరాజు నాయక్ మాట్లాడుతూ.. మండలంలోని ఉప సర్పంచ్ అందరిని కలుపుకొని గ్రామాల అభివృద్ధి కోసం ఐకమత్యంతో పనిచేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.

ఫోరం నూతన కమిటీ వివరాలు:

గౌరవ అధ్యక్షులు: జంపాల పుష్పలీల-అంజయ్య

అధ్యక్షుడు: గాదెపాక కిరణ్

వర్కింగ్ ప్రెసిడెంట్: బేజాడి సురేష్

ఉపాధ్యక్షులు:గొనె మహేందర్, పూజారి సురేష్

ప్రధాన కార్యదర్శి: లకావత్ నాగరాజు నాయక్

కోశాధికారి: కత్తుల ఎల్లయ్య

ప్రచార కార్యదర్శి:మారేపల్లి బిక్షపతి

సంయుక్త కార్యదర్శులు: పడిసే అశోక్, గుగులోత్ కమలమ్మ, వాసు నాయక్

ఫోరం సభ్యులు:లకావత్ వెంకన్న నాయక్, భూక్య సురేష్ నాయక్, భూక్య సంగీత, నరేష్ నాయక్, బానోత్ వీరన్న నాయక్, లకావత్ బాలు నాయక్, దాసరి ఉప్పలయ్య తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి

ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్

రాజ్‌భవన్ ముట్టడికి యత్నం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల అరెస్ట్

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)

దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితులు డిమాండ్ చేశాయి. ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించేలా ఉందని తాము భావిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని,ఈ వ్యవహారంలో బాధ్యత వహించాల్సిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరాయి.ఈ డిమాండ్ల సాధన కోసం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజ్‌భవన్ ముట్టడికి యత్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్‌తో పాటు పలువురు విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు.రాజ్‌భవన్ ముట్టడి యత్నం సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది.నిరసనలో పాల్గొన్న విద్యార్థి, యువజన నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి దబీర్‌పురా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కును, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఓటరు జాబితాల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై పోలీసులు అణచివేత ధోరణి అవలంబించడం సరికాదని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ విధానాలను విరమించుకోవాలని, ఓటు హక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలనే తమ డిమాండ్ నెరవేరే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల పాల్గొన్నారు

ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా.. పేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం!

-60 మంది లబ్ధిదారులకు రూ.60.06 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

-దసరా పండుగ వేళ ఆడబిడ్డల కుటుంబాల్లో ఆనందం నింపడమే లక్ష్యం.

-ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ప్రజా వాయిస్ వేములపల్లి

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలకు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా శనివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములపల్లి, మాడ్గులపల్లి మండలాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ. 60,06,960 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. దసరా పండుగ వేళ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందుకోవడం లబ్ధిదారుల కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతుందని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో దాదాపు 500 మంది లబ్ధిదారులకు ఈ పథకాల కింద చెక్కులు మంజూరయ్యాయని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. పేద ప్రజల సంక్షేమం, వారి కుటుంబాల్లో ఆనందం నింపడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు,వేములపల్లి, మాడ్గులపల్లి మండలాలకు చెందిన సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బి ఎల్ ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు కృషి..!

- ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- 18వ వార్డు కౌన్సిలర్ శ్రీరామ్ సరస్వతి నరేందర్

ప్రజా వాయిస్/దుబ్బాక:

దుబ్బాకలో పేదలకు ఇచ్చిన మాట ఇచ్చాం నిలబెట్టుకున్నామని, గత బీఆర్ఎస్ పాలనలో ఎదురుచూపులు... కాంగ్రెస్ ప్రభుత్వంలో పట్టాల పంపిణీ చేస్తున్నట్లు 18వ వార్డు కౌన్సిలర్ శ్రీరామ్ సరస్వతి నరేందర్ అన్నారు. దుబ్బాక వివిధ వార్డులకు చెందిన పేదల కలను సాకారం చేసిన దుబ్బాక ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారంతో దుబ్బాక పట్టణ పరిధిలోని అర్హులైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం అమలులో పేదలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. మాట ఇవ్వడమే కాదు.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇంకా పట్టాలు అందని వారు అధైర్యపడవద్దని, వారి వివరాలను పరిశీలించి, విచారణ అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేయడం తమ బాధ్యత అని వారు భరోసా ఇచ్చారు. పేదలకు సొంతింటి భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్, 15వ వార్డు కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ శ్రీనివాస్,14 వ వార్డు కౌన్సిలర్ తునికి సురేష్, 20వ వార్డు కౌన్సిలర్ ఐరేనీ అఖిల సాయి తేజ గౌడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మా ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేదే లేదు

బిఆర్ఎస్ నాయకుల పై విరుచుకపడ్డ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడుపుగంటి హరికృష్ణ

ప్రజా వాయిస్ దంతాలపల్లి అక్టోబర్17

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరికృష్ణ నాయకత్వంలో సమావేశం అవడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరికృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, దంతాలపల్లి మండల బిఆర్ఎస్ నాయకుల పై ఘాటు వాక్యలు చేశారు. పది సంవత్సరాల కాలంలో మీరు చేసిన పనులు అభివృద్ధికి సంబంధించిన ప్రోసెడింగ్స్ ఆర్డర్స్ మీరు తీసుకురండి,మా ఎమ్మెల్యే అయినా డాక్టర్ రామచంద్రనాయక్ గెలిచిన మూడు సంవత్సరాల్లో చేసిన పనులపై మేము ప్రోసెడింగ్స్ కాపీలను తీసుకొని దంతాలపల్లి మండల కేంద్రంలో చర్చకు సిద్ధం అని బహిరంగంగా సవాలు విసిరారు. బిఆర్ఎస్ హయాంలో చేసిన దందాలను కప్పిపుచ్చుకోవడానికి మా కాంగ్రెస్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ పై నిందలను మోపడం సిగ్గుచేటు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని సక్రమమైన పద్ధతిలో విఆర్ఎస్ నాయకులు నడుచుకుంటే బాగుంటుందని లేకుంటే రాబోయే రోజులలో పుట్టగతులు లేకుండా పోతారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరికృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఎం సి కమిటీ వైస్ ఛైర్మెన్ గుగులోతు బట్టు నాయక్ , సర్పంచ్ ల మండల ఫోరమ్ అధ్యక్షుడు అక్కిరెడ్డి దామోదర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సతీష్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సాధు లింగారెడ్డి, గురుపాల్ రెడ్డి, సర్పంచులు బేతమల్ల జయరాజ్, పోట్యా నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు నెమ్మది యాకన్న, మల్లం శ్రీను, గండి మధు, కడుదుల మహేందర్ రెడ్డి, చిట్యాల యాకంభ్రం లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసిన 24 గంటల లోపే విద్యుత్ సమస్య పరిష్కారం..

జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రత్యేక చొరవకు రైతుల కృతజ్ఞతలు.

ప్రజా వాయిస్ పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల రూరల్ పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీ లోని 7 మరియు 8వ వార్డ్ పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాలు గత కొన్ని రోజుల క్రితం పడిపోవడం జరిగింది. విద్యుత్ స్తంభాలు కుప్పకూలడంతో రైతుల పంట పొలాలకు వెళ్ళ విద్యుత్ సదుపాయం లేకపోవడంతో పంట పొలాలకు నీరు లేక ఎండిపోతున్నాయంటూ ప్రజా వాయిస్ పత్రిక కొత్తగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ విలేఖరి అయినటువంటి నూనావత్ రఘురాం ఈ విద్యుత్ సమస్యను భద్రాద్రి జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ మహేందర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో రైతు విద్యుత్ సమస్యపై సానుకూలంగా స్పందించిన భద్రాద్రి జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ మహేందర్ ప్రత్యేక చొరవ తీసుకొని తక్షణమే పాల్వంచ డివిజనల్ ఇంజనీర్ కు ఆదేశాలు జారీ చేసి 24 గంటల సమయంలో రంగాపురం గ్రామ రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్ అందించి రైతు సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సాధించాలంటూ అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేయడం జరిగింది. జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ మహేందర్ ఆదేశాల మేరకు 24 గంటల సమయం మించకుండా రైతులకు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు అందజేసిన పాల్వంచ డివిజనల్ అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్న రైతులు.

సొనాల మండలంలో దుర్గామాత నిమజ్జన ఊరేగింపుపై ఎంపీడీవో సూచనలు

: ప్రజా వాయిస్: సొనాల

సొనాల మండల కేంద్రంలో మరియు ఊరేగింపు కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం చేయడానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) దుర్గామాత స్వాములతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రత్నాకర్ రావు స్వాములకు పలు కీలకమైన భద్రతా చర్యలను మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు: విద్యుత్ భద్రత: ఊరేగింపు నిర్వహించే మార్గంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మండపాల వద్ద జాగ్రత్తలు:

దుర్గామాత మండపాల వద్ద భక్తుల రద్దీని నియంత్రించేందుకు మరియు అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. శాంతిభద్రతలు: నిమజ్జన ఊరేగింపు సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అందరూ శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. అధికారుల సహకారం: ప్రభుత్వ నిబంధనలకు లోబడి, అధికారుల సూచనలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొనాల మండలంలోని దుర్గామాత స్వాములు మరియు స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారుల సూచనలను శ్రద్ధగా ఆలకించారు.

నీటి బొట్టును ఆదా చేద్దాం ఇంట్లోనే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుందాం

బొబ్బిలిగాం సర్పంచ్ మహమ్మద్ సజీత్

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు అపరిమితంగా ఉండాలి

(ప్రజా వాయిస్ షాబాద్)

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం బొబ్బిలిగాం గ్రామంలో సర్పంచ్ మహమ్మద్ సజీత్ అధ్యక్షతన గ్రామసభ సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్యేక అధికారి వీరా సింగ్ హాజరయ్యారు ఈ సందర్భంగా సర్పంచ్ సజీత్ మరియు అధికారులు మాట్లాడుతూ.. ఇది ప్రజలు, ముఖ్యంగా రైతాంగం తీవ్ర అప్రమత్తంగా ఉండాల్సిన సమయమని పేర్కొన్నారు. రానున్న కాలంలో ఎల్‌నినో ప్రభావం మొదటగా వ్యవసాయ రంగంపై చూపనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సాగునీరు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ రంగాపైనా ఇది తీవ్ర ప్రభావం చూపనుందని, తద్వారా ఇంట్లోనే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుందాం సామాన్య ప్రజల రోజువారీ దినచర్యలపై కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు ఈ పరిస్థితులను అధిగమించడానికి ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకుంటూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామ్ రెడ్డి, వార్డు సభ్యులు డి. రాజు, కే. మహేష్, కే. అనిత, ఏ. అనిత, ఎండి. నజీర్, హమీదా బేగం మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దసరా కానుకగా 81 మంది పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు, షూల పంపిణీ

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంటం శిరీషా కృష్ణారెడ్డి

మేడ్చల్ జిల్లా, శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :

దసరా పండుగను పురస్కరించుకుని అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 81 మంది పారిశుద్ధ్య సిబ్బందికి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దుస్తులు, షూలను పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ, పండుగ సందర్భంగా వారికి అవసరమైన దుస్తులు, పాదరక్షలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పారిశుద్ధ్య కార్మికుడికి రెండు జతల దుస్తులతో పాటు ఒక జత షూలను పంపిణీ చేశారు. మొత్తం 81 మంది సిబ్బందికి ఈ సామగ్రిని అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కంటం శిరీషా కృష్ణారెడ్డి మాట్లాడుతూ... పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పట్టణ పరిశుభ్రత కోసం కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని, వారి సేవలను గుర్తించి దసరా పండుగ సందర్భంగా దుస్తులు, షూలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించడం మున్సిపాలిటీ బాధ్యత అని ఆమె తెలిపారు. కార్మికుల సేవలను గుర్తించడం, వారి సంక్షేమానికి తోడ్పడటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ మేనేజర్ వేణుగోపాల్, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

కారు బోల్తా ఒకరు మృతి

రెండు బైకులను ఢీకొట్టి పల్టీలు కొట్టిన కారు

రెండు బైకుల ముగ్గురికి గాయాలు

(ప్రజా వాయిస్ షాద్‌నగర్)

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని షాద్‌నగర్-పరిగి రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది గ్రానైట్ కంపెనీ సమీపంలో వేగంగా వచ్చిన కారు రెండు బైకులను వరుసగా ఢీకొట్టిన ఘటనలో బోడంపహాడ్ గ్రామానికి చెందిన కోరే చిన్న వెంకటయ్యతో మృతి చెందారు స్థానికుల కథనం ప్రకారం కారు అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి మొదట సర్దార్‌నగర్ వద్ద కక్కునూరు గ్రామానికి చెందిన ఇద్దరు ప్రయాణిస్తున్న బైక్‌ను కారు ఢీకొట్టింది. అనంతరం షాద్‌నగర్ వైపు దూసుకొచ్చి మరో బైక్‌ను ఢీకొట్టి పల్టీలు కొడుతూ రహదారి పక్కనున్న పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బోడంపహాడ్‌కు చెందిన కోరే చిన్న వెంకటయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి మృతి చెందారు ఇతర క్షతగాత్రులను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రమాద సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ తొలుత సర్దార్‌నగర్ వద్ద గాయపడిన వారిని తరలించేందుకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. దీంతో మరోచోట తీవ్రంగా గాయపడిన కారు డ్రైవర్‌కు సకాలంలో అంబులెన్స్ అందుబాటులో లేకపోయిందనే చర్చ స్థానికంగా సాగుతోంది. ఈ పరిణామాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా ప్రమాదానికి అతివేగమే కారణమా అనే అంశాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది ప్రచురించే ముందు ఇద్దరి మృతి, డ్రైవర్ మద్యం సేవించిన విషయం, అంబులెన్స్ ఆలస్యంపై పోలీసుల లేదా సంబంధిత అధికారుల నిర్ధారణ తీసుకోవడం మంచిది. అలాగే ప్రమాదం జరిగిన తేదీని నిర్ధారించండి.

ఎం సి పి ఐ యు పార్టీ మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 18వ వర్ధంతి

స్మారక స్థూపం వద్ద ఘన నివాళులు అర్పించిన ఎం సిపిఐ(యు) పార్టీ నాయకులు.

జిల్లాకార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్.

మతోన్మాద దోపిడీ విదానాలకు ప్రత్యామ్నాయం మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానమే

వర్గ సామాజిక ఐక్యతకు నికరంగా నిలబడి పోరాడేది ఎం సి పి ఐ (యు)మాత్రమే

ఎం సి పి ఐ (యు) పార్టీ దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాద దోపిడి విధానాలకు ప్రత్యామ్నాయం

ప్రజా వాయిస్ బెల్లంపల్లి టౌన్

మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానమే ఏకైక మార్గమని అందుకోసం నికరంగా నిలబడి ముందుకు సాగుతున్న పార్టీ ఎం సి పి ఐ (యు) మాత్రమే అని ఎం సి పి ఐ (యు)పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎం సి పీ ఐ (యు). మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలో పార్టీ జిల్లాసహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ అధ్యక్షతన ప్రజాస్వామ్య హక్కులు - నియంతృత్వ ధోరణలు - వామపక్షాల కర్తవ్యం అనే అంశంపై ఎం సి పి ఐ (యు) వ్యవస్థాపకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 18వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో వారి స్మారక స్థూపం వద్ద వారి చిత్రపటానికి పార్టీ,ప్రజా సంఘాల నాయకులు పూలమాలవేసి ఘనం గా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లాకార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ సభ అధ్యక్షులు పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ 80 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో ఆకలి, దారిద్రం. నిరుద్యోగం. ఆత్మహత్యలు,అత్యాచారాలు, హింసతోపాటు కుల-మత బేధాలు, ప్రాంతీయ తత్వాలను పాలకవర్గాలు అనైతిక రాజకీయ విధానాలతో పెంచి పోషిస్తూ సెక్యులర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన ఆర్థిక దోపిడితో పాటు కులమత తత్వాలను పెంచి పోషించిందని, ఆర్‌ఎస్ఎస్ భావజాలంతో మూడోసారి కేంద్రాన్ని పాలిస్తున్న బిజెపి కూడా తన మత భావాజాలన్నీ పెంపొందించుకుంటూ మైనార్టీ మతాలపై,దళిత,గిరిజన, అట్టడుగు వర్గాలపై మనువాద పాలన పేరుతో దాడులకు పూనుకుంటూ వస్తుందని,గత పాలకవర్గం లాగానే కార్పొరేట్, పెట్టుబడుదారి వర్గాలకు దేశ సంపదను ఆదాని, అంబానీలకు కట్టబెట్టిందని ,తన మతోన్మాద పెట్టుబడుదారి,ఆర్థిక విధానాలను ప్రశ్నించిన వారిపై పాసీజంతో దురాహంకారపూరితమైన ఉన్మాదా చర్యలకు పూనుకుంటుందని,ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ, లాంటి స్వతంత్ర వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకొని దేశ రాజకీయ వ్యవస్థలను కలుషితం చేస్తుందని,భారత రాజ్యాంగం,ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని,ఒకే దేశం,ఒకే మతం,ఒకే భాష అంటూ ఒకే ఎన్నికల పేరుతో జమిలి ఎన్నికల విధానానికి ఒడిగట్టి ప్రజాస్వామ్య విలువలను,రాజ్యాంగ విలువలను సమాధి చేస్తుందని, అనేక ఆంక్షల నేపథ్యంలో సాధించుకున్న మన తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ కూడా రాష్ట్ర అభివృద్ధి పేరుతో కేంద్రంలోని బిజెపి చేసిన తప్పుడు చట్టాలను ప్రజా వ్యతిరేక విధాలను బలపరుస్తున్నాయని,కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న పాసిస్ట్,మనువాద విధానాలకు, సెక్యులర్ ముసుగులో ఉన్న కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా కార్పొరేట్, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను కొనసాగిస్తున్న దోపిడి వర్గాల పాలనలో సమస్త హక్కులు కోల్పోతున్న శ్రామిక వర్గ ఐక్య పోరాటాల బలోపేతానికి మార్క్సిజమే మార్గదిశగా, తరతరాలుగా అసమానలతో అణిగిమనిగి ఉన్న భారత సమాజాన్ని అంబేద్కర్ ఆలోచన విధానంతో నిర్మూలించే దిశగా రాజకీయ ఆర్థిక సామాజిసమానత్వాన్ని బహుజనులకు రాజ్యాధికారాన్ని సాదించేందుకు ఎంసిపిఐ (యు) పార్టీ ముందుండి పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,మండల కార్యదర్శి సతీష్,మహిళ సమాఖ్య నాయకులు కాంపల్లి రాధ,దుర్గం లక్ష్మి, కామెర పద్మ,యువజన,విద్యార్థి నాయకులునరేష్,శేఖర్, సాయి,రాం,మహేష్,ఆకాష్,అరుణ్ వివిధ మండలాల నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఆందోల్ నియోజకవర్గాన్ని వెంటనే కరవు ప్రాంతంగా ప్రకటించాలి

సింగూర్ నీళ్లు ఖాళీ చేసి ఏడాదైనా ఇప్పటికీ రిపేర్లు లేవు

వరి, ఇతర పంటల నష్టాన్ని అంచనా వేసీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ డిమాండ్

పాలసీ నిర్ణయాల్లో పాలకుల పరస్పర విరుద్ధ వైఖరి

ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించే యత్నం

చౌటకూర్ మండలంలో ఎండిన వరి పొలాల పరిశీలన

రైతులకు బీఆర్ఎస్ పార్టీ భరోసా

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

రాష్ట్రంలో తీవ్రమైన కరవు పరిస్థితులు నెలకొన్నా, అన్నదాతలు సాగునీరు, విద్యుత్ లేక అల్లాడుతున్నా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించడంలో ఘోరంగా విఫలమైందని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. నేడు ఆయన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి, నీరందక నిలువునా ఎండిపోయిన వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటలు నష్టపోయి తీవ్ర ఆవేదనలో ఉన్న రైతులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా చౌటకూర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రాంతి కిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.

సింగూర్ జలాల ఖాళీ - పాలకుల దురుద్దేశానికి నిదర్శనం

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం ఉంటుందని, వర్షాభావ పరిస్థితులు తప్పవని వాతావరణ నిపుణులు ముందే హెచ్చరించినా నిండుకుండలా ఉన్న సింగూర్ ప్రాజెక్టు జలాలను కిందికి వదిలేశారు. ఇది కేవలం పాలకుల అవగాహనా లోపం మాత్రమే కాదు, వారి ఆలోచనా విధానమే సరిగ్గా లేదనడానికి ప్రత్యక్ష నిదర్శనం. గేట్ల రిపేర్ల, ప్రాజెక్ట్ మరమ్మత్తుల పేరుతో ప్రాజెక్టు నీళ్లను ఖాళీ చేసి నేటికి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు ఆ మరమ్మతులు పూర్తి చేయలేకపోయారు. నీళ్లు లేక, నిల్వ చేసుకునే సోయి లేక నేడు ఆందోల్ రైతాంగాన్ని సాగునీటికి, తాగునీటికి తండ్లాడేలా చేసిన అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానిది అని విమర్శించారు.

పరస్పర విరుద్ధ ప్రకటనలు - పాలనా వైఫల్యం

"రాష్ట్రంలో కరవు పరిస్థితులపై ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తుంటే, పరిష్కారం చూపాల్సింది పోయి మాపైనే ఎదురుదాడి చేస్తూ సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి నుంచి బొగ్గును యాదాద్రి ప్లాంట్‌కు ఇవ్వాలని కోరితే, బొగ్గు నిల్వలు లేవని, ప్లాంట్ పనిచేయడం లేదని సీఎం గతంలో అసత్య ప్రచారాలు చేశారు. ప్రాజెక్టుల నుంచి నీటిని ఎత్తిపోయాలని కోరితే, బ్రిడ్జి కూలిపోతుందని చెప్పి దాటవేసి, ఇప్పుడు మళ్లీ నీళ్ల ఎత్తె ప్రయత్నాలు చేస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు వ్యర్థమని విమర్శించిన నోటితోనే, ఇప్పుడు కరవు రాగానే మళ్లీ అదే ప్రాజెక్టు నుంచి నీటిని తోడే యత్నాలు చేస్తున్నారు. సమయానికి ప్రజాహిత నిర్ణయాలు తీసుకోకుండా వ్యవహరిస్తున్న సీఎం తీరు చూస్తుంటే విస్మయం కలుగుతోంది. ప్రజలను కాపాడటానికి కాంగ్రెస్ అధిష్టానమైనా, లేదా గౌరవ గవర్నర్ అయినా జోక్యం చేసుకోవాలని క్రాంతి కిరణ్ కోరారు.

ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు కొన్ని డిమాండ్లు పెట్టారు:

1. కరవు నియోజకవర్గంగా ప్రకటించాలి: భూగర్భ జలాలు అడుగంటి, వర్షాలు లేక పంటలు ఎండిపోయిన ఆందోల్ నియోజకవర్గాన్ని వెంటనే అధికారికంగా కరవు ప్రాంతంగా ప్రకటించాలి. సాగునీరు అందక ఎండిపోయిన వరితో పాటు, ప్రతికూల వాతావరణం వల్ల నష్టపోయిన పత్తి, ఇతర అన్ని రకాల పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తక్షణ నష్టపరిహారం చెల్లించాలి. సింగూర్ మరమ్మతులు తక్షణం పూర్తి చేయాలి: ఏడాదిగా సాగదీస్తున్న సింగూర్ ప్రాజెక్టు మరమ్మతులను వెంటనే పూర్తి చేసి, రైతులకు సాగునీటి భరోసా కల్పించాలి. రైతులకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష చౌటకూర్ మండల పర్యటనలో రైతులకు భరోసా ఇస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసినా అన్నదాతలు అధైర్యపడవద్దు. పదేళ్ల పాటు రైతును రాజుగా చూసిన కేసీఆర్ గారి నాయకత్వం మళ్లీ వస్తుంది. రైతాంగానికి మంచి రోజులు తిరిగి వస్తాయి. అప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ ప్రతి రైతు వెన్నంటే ఉండి అండగా నిలబడుతుంది అని క్రాంతి కిరణ్ స్పష్టం చేశారు

డీ. రేపాక వాసికి రెండవ పీహెచ్‌డీ... పట్టా

-గవర్నర్ చేతుల మీదుగా పట్టా అందుకున్న డా.పి. శ్రీనివాసులు

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని డీ.రేపాక గ్రామానికి చెందిన డా.పి. శ్రీనివాసులు గణితశాస్త్రంలో రెండవ పీహెచ్‌డీ పట్టా సాధించి తన ప్రతిభను మరోసారి చాటుకున్నారు. ప్రస్తుతం ఆయన (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) (ఆర్జీయూకేటీ) బాసరలో గణితశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మరియు అదనపు చీఫ్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేతుల మీదుగా అయన రెండో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. గణిత శాస్త్రంలోని ('కాంప్లెక్స్ అనాలసిస్') విభాగంలో (యూనివాలెంట్ "ఫంక్షన్స్ విత్ నెగిటివ్ కో ఎఫీషియన్స్) అనే అంశంపై పరిశోధ చేశారు. యూనివాలెంట్ ఫంక్షన్ల గణిత లక్షణాలు, వాటి గుణకాల స్వభావం, కాంప్లెక్స్ అనాలిసిస్‌కు సంబంధించిన వివిధ గణిత సమస్యలను ఆయన అధ్యయనం చేయడం జరిగింది చేయడం జరిగింది. ప్రస్తుతం గణిత శాస్త్రంలో పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న కొన్ని క్లిష్టమైన గణిత సమస్యలను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి పరిశోధన ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ రంగంలో జరిగే పరిశోధనలు కొన్ని క్లిష్టమైన గణిత సమస్యల పరిష్కారానికి కొత్త మార్గాలను, విధానాలను సూచించే అవకాశం ఉందని తెలిపారు. గణిత శాస్త్రంలో రెండవ పి హెచ్ డీ పట్టాను పొందడం తన విద్యా ప్రస్థానంలో గొప్ప మైలురాయని ఈ విజయాన్ని సాధించినందుకు ఎంతో సంతోషిస్తున్నానని అన్నారు. తన పరిశోధనకు మార్గదర్శకత్వం వహించిన పరిశోధన పర్యవేక్షకులకు ముఖ్యంగా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ సహుద్యోగులకు, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు మరియు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారి ప్రోత్సాహం సహకారం ఆశీస్సులు తన ప్రయాణంలో ఎంతో విలువైనవని ఈ విజయం గణిత శాస్త్రంలో మరింత పరిశోధన చేయడానికి నూతన విషయాలను అన్వేషించడానికి గణిత శాస్త్ర అభివృద్ధికి తన వంతు కృషి చేయడానికి మరియు విద్యార్థులకు తోటి పరిశోధనలకు తన జ్ఞానాన్ని పంచడానికి భరింత స్ఫూర్తినిస్తుందని అన్నారు.

వేములపల్లి ఎస్ఐ గా సురేష్ రెడ్డి

ప్రజా వాయిస్ వేములపల్లి

వేములపల్లి ఎస్ ఐ గా పి.సురేష్ రెడ్డి శనివారం బాధ్యతను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ ఐ డి వెంకటేశ్వర్లు, నల్గొండ విఆర్ కు, బదిలీ కావడంతో, నల్గొండ విఆర్ లో విధులు నిర్వహిస్తున్న , ఎస్ ఐ సురేష్ రెడ్డి వేములపల్లికి బదిలీపై వచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని, సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

పూలలో ప్రకృతి సోయగం.. బతుకమ్మలో తెలంగాణ ఆత్మగౌరవం

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక
నార్సింగి సీఎంసీ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి

ప్రజావాయిస్// రాజేంద్రనగర్:

పూలను పేర్చి ప్రకృతిని పూజించడం, ఆటపాటలతో ఆడపడుచులంతా ఒక్కటవడం,తరతరాల తెలంగాణ సంప్రదాయాన్ని చాటిచెప్పడం,ఇదే బతుకమ్మ పండుగ ప్రత్యేకత అని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి.లక్ష్మారెడ్డి అన్నారు.నార్సింగి సర్కిల్ కార్యాలయ ఆవరణలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని,తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి,ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అని వివరించారు. పూలతో అమ్మవారిని ఆరాధిస్తూ ప్రకృతిని గౌరవించే ఈ సంప్రదాయం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు.ఇలాంటి పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో కార్యాలయ అధికారులు,ఉద్యోగులు, శానిటరీ సిబ్బంది,స్వీపర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.పండుగ వాతావరణంలో సాగిన వేడుకలు కార్యాలయంలో సందడి నింపాయి.పాల్గొన్న సిబ్బందికి లక్ష్మారెడ్డి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

సౌదీ అరేబియాలో జగిత్యాల యువకుడి దుర్మరణం

జిజాన్‌లో క్రేన్ ప్రమాదంలో యాకిన్‌పూర్‌వాసి రాకేష్ మృతి
భారీ పైపుల మార్గం పనుల్లో ఉండగా కూలిన మట్టి.. అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన వలస కార్మికుడు
చేతికి అందిన కొడుకు దూరమై కుటుంబంలో తీవ్ర విషాదం.. శోకసంద్రంలో తల్లిదండ్రులు
మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని ప్రభుత్వానికి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

ప్రజా వాయిస్, కోరుట్ల:

ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన ఆ యువకుడి జీవితం అర్ధంతరంగా ముగిసింది. సౌదీ అరేబియాలో జరిగిన ఘోర ప్రమాదంలో జగిత్యాల జిల్లాకు చెందిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. జగిత్యాల జిల్లా, కోరుట్ల పట్టణంలోని విలీన గ్రామం అయిన యాకిన్‌పూర్ 6వ వార్డుకు చెందిన కాశిరెడ్డి రాజారెడ్డి, జల దంపతుల కుమారుడు కాశిరెడ్డి రాకేష్ (26) సౌదీ అరేబియాలోని జిజాన్ ప్రాంతంలో ఉపాధి నిమిత్తం రిగ్గర్‌గా (భారీ పరికరాలు, యంత్రాల సహాయంతో బరువైన వస్తువులను ఎత్తడం, తరలించడం వంటి పనులు చేసే కార్మికుడిగా) పనిచేస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో రాకేష్ కష్టపడి బతుకుదామని విదేశాలకు వెళ్లాడు. అయితే విధుల్లో భాగంగా జీఆర్‌పీ పైపుల మార్గం వద్ద పనిచేస్తున్న సమయంలో ఊహించని విధంగా క్రేన్‌కు సంబంధించిన ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో భారీ ఎత్తున మట్టి ఒక్కసారిగా ఆయనపై పడిపోవడంతో రాకేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రాకేష్ తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు సంతానం కాగా, రాకేష్‌తో పాటు సోదరి రమ్య ఉంది. ఇప్పటికే ఆమెకు వివాహమైంది. చేతికి అందిన కొడుకు విదేశాల్లో విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో యాకిన్‌పూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

కోరుట్ల కౌన్సిల్ సమావేశం ప్రశాంతం

5 అంశాలకు ఆమోదం.. వేసవి నీటి సమస్యలు, పండుగల ఏర్పాట్లపై అధికారులకు చైర్‌పర్సన్ ఆదేశాలు

ప్రజా వాయిస్, కోరుట్ల:

కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రశాంత వాతావరణంలో జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ వసంత తిరుమల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 6 అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో 5 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ, రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే త్వరలో రానున్న బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పట్టణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక పారిశుధ్య చర్యలు మరియు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి. రాఘవేంద్ర, వైస్ చైర్‌పర్సన్ మహమ్మద్ షాహిద్, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులతో పాటు డిప్యూటీ ఈఈ, మేనేజర్, టీపీవో, ఏఈ, జేఏవో, ఆర్‌వో, శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) మరియు ఇతర మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు బుగ్గారం క్రీడాకారులు ఎంపిక

జూనియర్ స్టేట్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించనున్న గజ్జల రాహుల్, నలిగంటి సుశీల్ కుమార్
ఈ నెల 18 నుంచి 20 వరకు నల్గొండ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలు

ప్రజా వాయిస్, నేరడిగొండ

నేరడిగొండ మండలం బుగ్గారం (బి) గ్రామానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు జూనియర్ స్టేట్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ (బాయ్స్) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన గజ్జల రాహుల్ మరియు నలిగంటి సుశీల్ కుమార్ తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. ?నల్గొండ జిల్లా వేదికగా ఈ నెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించే ఈ జూనియర్ స్టేట్ నెట్‌బాల్ పోటీల్లో వీరిద్దరూ పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల స్థానిక గ్రామస్తులు, క్రీడాభిమానులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ, క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

సోనాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు
ఉత్సాహంగా పాల్గొన్న వైద్య సిబ్బంది

ప్రజా వాయిస్ సోనాల

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సోనాల మండలంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో పండుగ వాతావరణం నెలకొనగా, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే బతుకమ్మ పండుగ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి పండుగ విశిష్టతను చాటిచెప్పేలా సంబరాలు నిర్వహించారు. సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు భావితరాలకు తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేయడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలు అందించడంలో నిరంతరం విధులు నిర్వహించే వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తమ విధులతో పాటు పండుగ వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందరూ కలిసిమెలిసి బతుకమ్మ సంబరాలను జరుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకలు సిబ్బందిలో ఐక్యతను, పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ పండుగల పట్ల ఉన్న అభిమానాన్ని చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ విమల, సూపర్‌వైజర్ సంధ్యాదేవి, హెచ్‌ఈ యశోద, అసిస్టెంట్ లింగారెడ్డి, గోవర్ధన్, గోవింద్‌తో పాటు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ వంటి పండుగలను ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందదాయకమని ఈ వేడుకలు చాటిచెప్పాయి.

బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాట్ల పరిశీలన
చెరువులు, ఘాట్ల వద్ద ముమ్మర చర్యలు
మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిజిఆర్

జిన్నారం ప్రజా వాయిస్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్మల గోవర్ధన్ రెడ్డి తో కౌన్సిలర్లు, అధికారులతో కలిసి గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం, వీరన్నగూడెం గ్రామాల్లో బతుకమ్మ ఆడే ప్రాంగణాలు, నిమజ్జనం చేసే చెరువు ఘాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో చెరువుల వద్ద నిమజ్జన ఘాట్ల ఏర్పాట్లు, లైటింగ్, పరిశుభ్రత పనులను సమీక్షించారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువు ఘాట్ల వద్ద భద్రత, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఏర్పాట్లలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా పండుగకు ముందే అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కమీషనర్ దశరథ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొనారు.

ఈరవత్తి అనిల్ కుమార్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

ఆదిలాబాద్ జిల్లా పద్మశాలి సంఘం నాయకుల విజ్ఞప్తి

ప్రజా వాయిస్ ఆదిలాబాద్

పద్మశాలి సామాజిక వర్గానికి, చేనేత కార్మికులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా చేనేత వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఈరవత్తి అనిల్ కుమార్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని ఆదిలాబాద్ జిల్లా పద్మశాలి సంఘం జిల్లా నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత నెల 30న సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా ఈరవత్తి అనిల్ కుమార్‌కు శాసనమండలిలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈరవత్తి అనిల్ కుమార్ కృషితో రాష్ట్రంలో రూ.49 కోట్ల చేనేత రుణమాఫీ, పెండింగ్‌లో ఉన్న రూ.290 కోట్ల చేనేత బకాయిల విడుదలతో పాటు, గల్ఫ్ దేశాల్లో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందించే అంశంపై కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి, పద్మశాలి సామాజిక వర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఎమ్మెల్సీ పదవి కల్పించాలని ఆదిలాబాద్ జిల్లా పద్మశాలి సంఘం నాయకులు కోరారు. పార్టీలకు అతీతంగా చేనేత వర్గాల సంక్షేమం, భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు తాళ్ళ రవీందర్, కామన్ విట్టల్, ఆడెపు మధుకర్, తుమ్మ రాజు, వేముల కృష్ణ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ చేయూత

రాష్ట్రంలోనేమోత్కూర్ వాట్సాప్ గ్రూప్ ముందంజ
సుమారు 300 కుటుంబాలకు ఆర్థిక సహాయం

ప్రజావాయిస్,మోత్కూరు,

(అక్టోబర్ 17):

మున్సిపల్ కేంద్రానికి చెందిన ఎడ్ల శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతునికి భార్య నవ్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ ని ఆశ్రయించగా ,దాతలు ,సభ్యుల సహకారంతో అందించిన రూ.24 వేల చెక్కును శనివారం స్వయంగా అందజేశారు. మన మోత్కూర్ వాట్సాప్ గ్రూప్ సుమారు 300 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి రాష్ట్రంలోనే ముందంజలో ఉందని గ్రూప్ సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య,మాజీ కో ఆప్షన్ సభ్యులు గనగాని నర్సయ్య,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం నాగార్జున రెడ్డి,ఆర్యవైశ్య, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు మొగుల్లపల్లి సోమయ్య,పోచం భిక్షపతి,గీత సొసైటీ అధ్యక్షుడు మొరిగాల సురేష్,వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, ఎం డి షాకీర్,కూరేళ్ల వెంకట్, మొరిగాల శ్రీను,కోమటి జనార్దన్,అవిశెట్టి కిరణ్,మధు తదితరులు పాల్గొన్నారు.

మోత్కూర్ ను కరువు మండలంగా ప్రకటించాలని తహశీల్దారు కార్యాలయం ముందు సిపిఎం ధర్నా

ప్రజావాయిస్, మోత్కూరు(అక్టోబర్ 17):
వర్షబావంతో నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు తక్షణమే చర్యలు చేపట్టడంతో పాటు అధికారులతో సర్వే నిర్వహించి మోత్కూర్ ను కరువు మండలంగా ప్రటించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోత్కూర్ ను కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.అనంతరం ఆర్ ఐ సుమన్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.....మోత్కూర్ మండలం ఇరవై శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో తీవ్రమైన వర్షబావ, కరువు పరిస్థితులను ఎదుర్కొంటుందని అన్నారు. వర్షాలు లేక పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు వరికి రూ 30 వేలు, పత్తిపంటలకు రూ.50 వేలు, కూరగాయలు ఇతర పంటలకు రూ 20 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చెయ్యాలని, గ్రామీణ పట్టణ ప్రాంతాలలో త్రాగునీటి సమస్య ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయని, ఉపాధి కరువై రైతులు వ్యవసాయ కూలీలు పనులు లేక వలస వెళ్ళకుండా ఉపాధి పనులను విస్తరించాలని కోరారు. తక్షణమే అధికారులతో సర్వే నిర్వహించి మోత్కూర్ ను కరువు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ టౌన్ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, కందుకూరి నర్సింహా, గుండు లక్ష్మి, ఎండీ అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

ల్యాబర్తి శివారులో ఘోర రోడ్డు ప్రమాదం!

కారు-బైక్ ఢీ.. 22 ఏళ్ల యువకుడు దుర్మరణం!

ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న యువకుడి మృతితో కుటుంబంలో తీరని విషాదం

వర్ధన్నపేట ప్రజా వాయిస్
వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో పరిసర ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ల్యాబర్తి గ్రామ శివారులో కారు–బైక్ ఢీకొన్న ప్రమాదంలో వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన చెన్న సాంబరాజు (22) ప్రాణాలు కోల్పోయినారూ. చిన్న వయసులోనే యువకుడు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

మృత్యువు రూపంలో దూసుకొచ్చిన ప్రమాదం!
వివరాల్లోకి వెళ్తే.. వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన చెన్న సాంబరాజు, తండ్రి దూడయ్య. ట్రాక్టర్ డ్రైవర్‌గా వృత్తిని కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ల్యాబర్తి గ్రామ శివారులో కారు, బైక్ ఢీకొన్న ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సాంబరాజు మృతి చెందినట్లు సమాచారం.

కుటుంబంలో కన్నీటి విషాదం!
చేతికొచ్చిన కొడుకు అకాల మరణవార్తతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పటివరకు సాధారణంగా సాగిన జీవితం ఒక్కసారిగా విషాదాంతం కావడంతో స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

మృతుని కుటుంబానికి గ్రామ సర్పంచ్ భత్తుల బాలరాజు,నాయకులు, యువత ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

ప్రజా వాయిస్.. వీపనగండ్ల
వీపనగండ్ల మండలం పుల్గర్ చర్ల గ్రామానికి చెందిన కల్మూరి భీమయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భత్తుల బాలరాజు, గ్రామ నాయకులు, యువకులు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అలాగే గ్రామ సర్పంచ్ భత్తుల బాలరాజు, గ్రామ నాయకులు ఎద్దుల సురేందర్ రెడ్డి,గ్రామ యువత ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి రూ.21,000 ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొని మృతునికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

రామోజీనాయక్ తండలో ఘనంగా న్యాయ సేవల మెగా డ్రైవ్ ముగింపు

ప్రజావాయిస్ /తుర్కపల్లి
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం రామోజీనాయక్ తండలో జాతీయ న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ సేవల మెగా డ్రైవ్ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ మెంబర్ సెక్రటరీ సి. హెచ్. పంచాక్షరి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అర్హుడికి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడం, అవసరమైన వారికి న్యాయ సహాయం అందించడం న్యాయ సేవల సంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు రాజ్యాంగం నిర్దేశించిన విధులను కూడా పాటించాలని సూచించారు.జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో గ్రామ ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించడంతో పాటు రేషన్ షాప్, సబ్ సెంటర్‌ను ప్రారంభించారు.బాలికలకు సైకిళ్లు, యువతకు పోటీ పరీక్షల పుస్తకాలు, అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు.అలాగే బొమ్మలరామారం జి.సి.ఎం.సి.సి.ఐ.కి చెందిన బాలబాలికలు మాదక ద్రవ్యాల నిషేధం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ నాటిక ప్రదర్శించారు. న్యాయమూర్తులు విద్యార్థులకు పుస్తకాలను బహూకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి మిలింద్ కాంబ్లే, జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి వి. మాధవీలత, హైకోర్టు న్యాయవాది, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు ఎం.ఏ. రహీం, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సి. హెచ్. శ్రీనివాస్, డీఆర్డీపీ పీడీ నాగిరెడ్డి, తుర్కపల్లి ఎస్ఐ, తహసీల్దార్, ఎంపీడీవో తదితర అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో చిన్నారుల కన్నీళ్లు తుడిచిన రాథోడ్ బాపూరావు

బాధితులకు ఆర్థిక సాయం, భరోసా

తల్లిదండ్రులను కోల్పోయి, అనారోగ్యంతో బాధపడుతున్న ఆత్రం నాగమణిని పరామర్శించిన బోథ్ మాజీ ఎమ్మెల్యే.

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడమే తెలంగాణ రక్షణ సేన లక్ష్యమని స్పష్టీకరణ

ప్రజా వాయిస్ బోథ్/ ఆదిలాబాద్
ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆత్రం నాగమణిని బోథ్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రక్షణ సేన (౧=హా) ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపూరావు పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి, అనారోగ్యంతో బాధపడుతున్న చెల్లి ప్రాణాలు కాపాడాలంటూ కన్నీటిపర్యంతమైన అక్క జల్దేవిని ఆయన ఓదార్చారు. "మీకు అండగా ఉంటా.. ధైర్యంగా ఉండండి.. మీ ఇంటికి కూడా వస్తా" అంటూ ఆ భగినీయులకు భరోసా కల్పించారు.ఈ సందర్భంగా రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ... నేరడిగొండ మండలం గుప్తాల గ్రామపంచాయతీ పరిధిలోని ఏషూ గూడ గ్రామానికి చెందిన ఆత్రం జల్దేవి, నాగమణి అక్కాచెల్లెళ్లని, రెండేళ్ల క్రితం కిడ్నీ వ్యాధితో తండ్రి, ఆరు నెలలకే తల్లి కూడా మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్న ఆ పిల్లల్లో నాగమణి అనారోగ్యానికి గురై రిమ్స్ ఐసీయూలో చికిత్స పొందుతుండటం తనను కలచివేసిందన్నారు. వైద్యులతో మాట్లాడి చిన్నారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశానని, మెరుగైన వైద్యం అందించాలని కోరినట్లు తెలిపారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేద కుటుంబాలకు తెలంగాణ రక్షణ సేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆశయాల మేరకు పేదలకు ఉచిత విద్య, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల కన్వీనర్ బానోత్ వసంత్ రావు, సీనియర్ నాయకులు రఘునాథ్, గుడిహత్నూర్ మండల కన్వీనర్ పిట్ల మహేందర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ శాఖలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

జిల్లా ఆయుష్ నోడల్ అధికారి

ప్రజా వాయిస్ మంచిర్యాల
మంచిర్యాల జిల్లాలో ఆయుష్ శాఖ పరిధిలో పొరుగు సేవల పద్ధతిన వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఆయుష్ నోడల్ అధికారి జి నీరజ ఒక ప్రకటనలో తెలిపారు.4 మెడికల్ ఆఫీసర్, 1 ఫార్మసిస్ట్, 1 సైకోసోషల్ కౌన్సిలర్ (సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు), 1 యోగ ప్రొఫెషనల్, 3 మల్టీ పర్పస్ వర్కర్ (ఫీూఔ) పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/ సంస్థ నుంచి ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, నేచురోపతిలో సంబంధిత విద్యార్హతతో పాటు తప్పనిసరి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, ఫార్మసిస్ట్ పోస్టుకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా–డి అర్హతతో పాటు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో నమోదు అయి ఉండాలని, సైకోసోషల్ కౌన్సిలర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని, యోగ ప్రొఫెషనల్ పోస్టుకు సంబంధిత విభాగంలో నిర్దేశిత విద్యార్హతతో పాటు నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో డిప్లొమా అర్హత ఉండాలని, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, సైకిల్ / మోటార్ సైకిల్ నడపగలగాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం వర్తించే సందర్భంలో, ఇతర అవసరమైన పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. అర్హత పరీక్షలో మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, మెరిట్ లిస్ట్ వెబ్ సైట్ లో ఉంచడం జరుగుతుందని తెలిపారు.,మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28వ తేదీన సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు అధికారిక నోటిఫికేషన్‌లోని పూర్తి నిబంధనలు, అర్హతలు, రిజర్వేషన్లు, ఎంపిక విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

అమీన్‌పూర్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

కాటా సునీత రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

జబర్దస్త్ కళాకారుల వినోదం.. ఉషారాణి పాటలతో హోరెత్తిన సంబరాలు

ఉత్తమ బతుకమ్మలకు అవార్డుల ప్రదానం ముఖ్య అతిథులుగా గూడెం యాదమ్మ, సింధు ఆదర్శ్ రెడ్డి

పటాన్‌చెరు, ప్రజావాయిస్:
అమీన్‌పూర్ డివిజన్‌లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు కాటా సునీత రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు మహిళల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా సాగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మలను అందంగా పేర్చిన మహిళలకు ఉత్తమ బతుకమ్మ అవార్డులను అందజేసి ప్రోత్సహించారు. జబర్దస్త్ కళాకారులు రచ్చ రవి, వినోద్ లు తమ హాస్య ప్రదర్శనలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. సింగర్ ఉషారాణి ఆలపించిన పాటలు మహిళలను ఉర్రూతలూగించాయి. కాజీపల్లి కళాకారుల బృందం ప్రదర్శనలు వేడుకలకు మరింత కళను తీసుకొచ్చాయి. ఆటపాటలు, వినోద కార్యక్రమాలతో అమీన్‌పూర్ ప్రాంతం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా కాటా రాజు సునీత మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ పండుగ సంప్రదాయాలను భావితరాలకు అందించాలని అన్నారు.గూడెం యాదమ్మ, సింధు ఆదర్శ్ రెడ్డి లు మాట్లాడుతూ.. బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తాయని తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పండుగల్లో బతుకమ్మకు విశిష్ట స్థానం ఉందన్నారు. సంప్రదాయాలను కాపాడుకుంటూ అందరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.

ఆపదలో ఉన్న కార్మిక కుటుంబానికి అండగా ఎమ్మెల్యే జిఎంఆర్

మానవత్వంతో స్పందించి అంత్యక్రియల కోసం రూ.75 వేల ఆర్థిక సాయం

పటాన్ చెరువు ప్రజావాయిస్
పొట్టకూటి కోసం సొంత రాష్ట్రాన్ని, ఆత్మీయులను విడిచి వచ్చి పటాన్చెరులో కార్మికుడిగా జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కుటుంబ పెద్దను కోల్పోయిన విషాదంలో ఒకవైపు కన్నీరుమున్నీరవుతుండగా.. మరోవైపు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా ఆర్థిక స్థోమత లేక ఆ కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. ఈ విషాద సమయంలో విషయం తెలుసుకున్న పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) మానవత్వంతో స్పందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. అంత్యక్రియల నిమిత్తం తన సొంత నిధుల నుంచి రూ.75 వేల ఆర్థిక సాయం అందించి మానవీయతను చాటుకున్నారు.వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని 24 పరగణాల జిల్లాకు చెందిన అమల్ ప్రమాణ్ గత కొంతకాలంగా తన కుటుంబంతో కలిసి పటాన్చెరు ప్రాంతంలోని స్థానిక పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో శ్రమిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయన.. శుక్రవారం రాత్రి అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.కుటుంబ పెద్దను కోల్పోయిన దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని స్వరాష్ట్రానికి తరలించడం, అంత్యక్రియలు నిర్వహించడం మరింత భారంగా మారింది. కనీసం చివరిసారిగా తమ ఆత్మీయుడికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించాలన్న కుటుంబ సభ్యుల ఆకాంక్షకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుగా నిలిచాయి.ఈ పరిస్థితిని ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి.. తన సొంత నిధుల నుంచి రూ.75 వేల ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, భవిష్యత్తులోనూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.మినీ ఇండియాగా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలో వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారని, వారి సంక్షేమం, భద్రత, ఆపద సమయంలో సహాయం అందించడం పట్ల తాము బాధ్యతతో వ్యవహరిస్తామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు.

గ్రేవ్ అక్విటల్ కేసులపై పోలీసు అధికారుల సమీక్ష

- దర్యాప్తు లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి
- సాక్ష్యాధారాలు, సాక్షుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అదనపు ఎస్పీ రాజేష్ మీనా

ప్రజావాయిస్/వికారాబాద్:
వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ (డీపీఆర్సీ) సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సెప్టెంబర్ నెలకు సంబంధించిన కేసులను సమీక్షించారు. సెప్టెంబర్ నెలలో నమోదైన గ్రేవ్ అక్విటల్ కేసులపై ప్రధానంగా చర్చించారు. నిందితులు నిర్దోషులుగా విడుదల కావడానికి గల కారణాలు, దర్యాప్తులో జరిగిన లోపాలు, సాక్ష్యాధారాల సమర్పణ, సాక్షుల హాజరు వంటి అంశాలను కేసుల వారీగా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ...కేసుల్లో గుర్తించిన లోపాలను సరిదిద్దుకుని, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు, సెషన్స్ కోర్టు లైజన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కోర్టు కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, సాక్ష్యాధారాల సేకరణ, కేసు రికార్డుల నిర్వహణ, సాక్షుల హాజరు, చార్జ్‌షీట్ల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యానికి తావులేకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో లీగల్ అడ్వైజర్ అనిల్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెహ్రాజ్ పిర్దోష్, డీఎస్పీలు బి. జనయ్య, ఎన్. శ్రీనివాస్, ఎస్. శ్రీనివాసులు, నర్సింగ్ యాదయ్య, అంజయ్య, సీఐలు నాగార్జున, పరమేశ్వర్ గౌడ్, వెంకట్, కొండల్ రెడ్డి, రఘు రాములు, రఘు కుమార్, వెంకట్ రామ్ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, సంబంధిత ఎస్డీపీఓలు, సెషన్స్ కోర్టు లైజన్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న జువ్వాడి నర్సింగరావు

అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు
ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష

ప్రజా వాయిస్, కోరుట్ల:
కోరుట్ల పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ రెంజర్ల కళ్యాణి ఆహ్వానం మేరకు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వార్డులో ఏర్పాటు చేసిన దుర్గామాతను తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ.. దుర్గాదేవి కృపాకటాక్షాలతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వసంత తిరుమల గంగాధర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కౌన్సిలర్ ఎడ్ల జలజ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నం అనిల్, జిందం లక్ష్మీనారాయణ, ఎడ్ల రమేష్, వెంకటేష్, మేకల నర్సయ్యలతో పాటు వార్డు ప్రజలు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూల పండుగతో పులకిస్తున్న పల్లెలు

ఆడబిడ్డల ఆటపాటలతో మార్మోగుతున్న వీధులు
అలరిస్తున్న ఆళ్ళ వారి బతుకమ్మ పందిరి

జూలూరుపాడు, ప్రజా వాయిస్:
తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి, సాంస్కృతిక వైభవానికి, ప్రతీక అయినా "బతుకమ్మ" (పూల పండుగ) వేడుకలతో మండల వ్యాప్తంగా పల్లెలన్నీ విరబూసిన పుదోటలా పులకించి పోతున్నాయి. ఏ గ్రామంలో చూసినా బతుకమ్మ వేడుకలు, వీధి వీధిన ఆడబిడ్డల ఆట పాటలతో మార్మోగుతున్నాయి. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా మండల పరిధి పడమట నర్సాపురం గ్రామంలో ఖమ్మం, కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన ప్రముఖ వ్యాపారవేత్త, గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఆళ్ళ శ్రీనివాసరావు ఇంటి ముందు రంగురంగుల విద్యుత్ దీప కాంతుల అలంకరణతో ఏర్పాటుచేసిన బతుకమ్మ పందిరి ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ పందిరిలో ప్రతిరోజు మహిళలు,

పిల్లలు సాంప్రదాయ వస్త్రధారణలో పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలలో పాల్గొని బతుకమ్మ వైభవాన్ని చాటుతున్నారు. దీనికి అన్ని రకాల సహాయ సహకారాలను ఆళ్ళ శ్రీనివాసరావు దంపతులు అందించడం విశేషం. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ, ప్రకృతితో మానవ జీవితానికి ఉన్న సంబంధాన్ని చాటి చెప్పే విశిష్టమైన పండుగ బతుకమ్మ, ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, మహిళల ఆత్మగౌరవం, ఐక్యత, కుటుంబ అనుబంధాలు, సామాజిక సమైక్యతను ప్రతిబింబిస్తుందని అన్నారు. తరతరాలుగా

కొనసాగుతున్న ఈ సాంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఇలాంటి వేడుకలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు, దోహదపడడంతో పాటు, మహిళల్లో ఐక్యత భావాన్ని మరింత బలోపేతం చేసేందుకు సహాయపడుతుందని తెలిపారు. బతుకమ్మ పండుగ ప్రజలందరి జీవితాలలో సుఖ సంతోషాలు నింపాలని, ప్రతి ఇంట ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సిరికొండలో కోలాహలంగా మహా అన్నప్రసాద వితరణ

దుర్గామాత సన్నిధిలో ప్రత్యేక పూజలు
పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

ప్రజా వాయిస్, కథలాపూర్:
మండలంలోని సిరికొండ గ్రామంలో శనివారం దుర్గామాత సన్నిధిలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్థానిక పురోహితులు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అన్నదానం మహాదానమనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులలో ఆధ్యాత్మిక భావనతో పాటు సేవాభావాన్ని పెంపొందించింది. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణకు ఆర్థిక సహకారం అందించిన దాతలు ఇట్టేడి లింగారెడ్డి, ఇట్టేడి రాజేందర్‌లతో పాటు కార్యక్రమ నిర్వాహకులకు భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామంపై ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో భవానీ స్వాములు, మహిళలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబురాలు

- టి.ఎన్.జి.ఓ. యూనియన్, అన్ని శాఖల ఉద్యోగుల ఆటపాటలతో సందడిగా మారిన ప్రాంగణం
- గౌరమ్మకు పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడిన అదనపు కలెక్టర్ సంగీత

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంగారెడ్డి కలెక్టరేట్‌లోని అన్ని శాఖల ఉద్యోగులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత గౌరమ్మకు ప్రత్యేక

పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. పాటలకు అనుగుణంగా మహిళా ఉద్యోగులు నృత్యాలు చేస్తూ సంబురాల్లో పాల్గొన్నారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులు ఒకచోట చేరి పండుగను సామూహికంగా జరుపుకోవడంతో కలెక్టరేట్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా " లలితాదేవి, టి జి ఓ జిల్లా అధ్యక్షులు డా ' వైద్యనాథ్ , టి జి ఐ ఐ సి మాజీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి,జిల్లా టి.ఎన్.జి.ఓ. అధ్యక్షులు,మహిళా నాయకులు, కార్యవర్గం సభ్యులు ,కలెక్టరేట్‌లోని వివిధ శాఖల మహిళా ఉద్యోగులు , సిబ్బంది సాంస్కృతిక సారథి కళాకారులు, కలెక్టరేట్ సమీప కాలనీ మహిళలు పాల్గొన్నారు.

దేశమంతటా మరోసారి ప్రజ్వ రిల్లుతున్న షోయబుల్లా ఖాన్ పోరాట త్యాగాన్ని స్మరించుకోవాలి

అసమాన కలం యోధుడు షోయబుల్లా ఖాన్
సంకెళ్ళు మోస్తున్న మీడియాకు షోయబ్ స్ఫూర్తి
టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో ఘనంగా106 వ జయంతి వేడుకలు

ప్రజా వాయిస్ కొత్త గూడ
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామిక ,విలువలు కోసం మరియు మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడిన జర్నలిస్టు యోధుడు షోయబుల్లాఖాన్ అని,, ప్రస్తుతం మతోన్మాదం దేశమంతటా మరోసారి ప్రజ్వ రిల్లుతున్న ప్రస్తుత తరుణంలో షోయబుల్లా ఖాన్ పోరాటాన్ని, త్యాగాన్ని స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నదని టీయూడబ్ల్యూజే (ఐజేయు) కొత్తగూడ మండల అధ్యక్షులు ఎస్.కె.సల్మాన్ పాషా అన్నారు...మండల కేంద్రంలోనీ గ్రామపంచాయతి ఆవరణంలో నిర్వహించిన షోయబుల్లాఖాన్ 106వ జయంతి సందర్భంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సల్మాన్ మాట్లడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువు కొని ప్రభుత్వోద్యోగంలో చేరకుండా ఆదాయం తక్కువైనప్పటికీ జర్నలిస్టు వృత్తిని ఎంచుకున్నాడు. జీ హుజూర్ అనకుండా స్వేచ్ఛగా బతకడమే గాకుండా పదిమందిని చైతన్యపరిచేందుకు పత్రిక రంగమే గొప్పదని తలిచిండు.. మొదట 'తేజ్' అనే పత్రికలో పనిచేసి నిజాం ప్రభుత్వాన్ని, అధికార వర్గాన్ని విమర్శించడంతో దాన్ని నిషేధించారు. ఇవ్వాళ పత్రికా స్వేచ్ఛర్యాంకింగ్ ల్లో మొత్తం 180 దేశాల్లో ఇండియా 161వ స్థానంలో ఉన్నది. 'రిపోర్టర్స్ విత్‌ఔట్ బార్డర్స్' అనే సంస్థ సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. జర్నలిస్టు రాణా అయూబ్ పోస్టులను ప్రభుత్వ ఆదేశా లకు తలొగ్గి 'ట్విటర్' సంస్థ తొలగించింది. జర్నలి స్టు రవీష్కుమార్, తులసి చందు ఇట్లా వందలాది ప్రశ్నించే వారిని ట్రోలింగ్ చేయడం, కొన్ని చోట్ల భౌతిక దాడులకు గురి చేయడం నిత్యకృత్యమయింది అని, ఇట్లా మీడియా స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్న ప్రస్తుత తరుణంలో దేశ ఐక్యత, లౌకిక, ప్రజాస్వామిక విలువల కోసం, పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం, నమ్మిన సిద్ధాంతాన్ని ప్రచారం చేసే, నిజాల్ని వెలుగులోకి తెచ్చే జర్నలిస్టుల హక్కుల కోసం ప్రాణాలను పణంగా పెట్టి కొట్లాడిన వీరుడు షోయబుల్లా ఖాన్ ను మళ్ళీ మళ్ళీ స్మరించుకోవాలని, షోయబుల్లా ఖాన్ హత్య ప్రజాస్వామ్యానికి, లౌకిక విలువలకు, పత్రికా స్వేచ్ఛకు పెద్ద విఘాతం అని,ఆయన చనిపోయి 80 ఏండ్లయిన తర్వాత కూడా ఇప్పుడు అంతకంటే పెద్ద ప్రమాదాన్ని మీడియా ఎదుర్కొంటున్నది. రాజ్యాంగం మనకు ఆర్టికల్ 19(1)ఎ లో కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలుగుతున్నది. ఇట్లాంటి సందర్భంలో వర్కింగ్ జర్నలిస్ట్ లు అంత షోయబుల్లాఖాన్ లాంటి త్యా గధనుల స్ఫూర్తిని ఆవాహన చేసుకోవాలి అని,,ప్రస్తుతం దేశమంతటా రగులుస్తున్న చిచ్చును చల్లార్చాలన్నా, షోయబ్ ఆశయాలు సదా ప్రచారంలో ఉండాలన్నా ఆయన స్మారకంగా ప్రతియేటా 'హిందూ–ముస్లిం' ఐక్యతను కాపాడి, పెంపొందించే ఒక ఉత్తమ జర్నలిస్టుకు తెలంగాణ 'మీడియా అకాడెమి' తరపున అవార్డు ఇవ్వాల్సిన అవసరమున్నది. అంతేగాదు ఆయన జీవితాన్ని పాఠ్యాంశంగా బోధించాల్సిన అవసరమున్నది అని అన్నారు..ఈ కార్యక్రమంలో ఐజేయూ జిల్లా నాయకులు పాలడుగు శ్రీధర్, శెట్టి పరుశురాం, మండల ఉపాధ్యక్షులు గోగు విజయ్ కుమార్,ప్రచార కార్యదర్శి తీగల ప్రేమ్ సాగర్, రాకేష్ వర్మ , ముఖ్య సలాదారులు సునీల్,రాజు కుమార్, చాపల శ్రీనివాస్ , వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్లలకు కేసీఆర్ మానసపుత్రిక కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
160 మంది లబ్ధిదారులకు రూ.1.60 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ

పటాన్ చెరువు ప్రజావాయిస్
పేదింటి ఆడపిల్లల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, డివిజన్లకు చెందిన 160 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన రూ. 1,60,18,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. ఆడపిల్లల వివాహాల కోసం పేద కుటుంబాలు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాల్లో వివాహ వేడుకలు సంతోషంగా జరిగేందుకు ఈ పథకాలు తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతోమంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ఆయా మండలాల తహశీల్దార్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.